


కేరాసింగి రోడ్డు పనులు పరిశీలిస్తున్న జేసీ నవీన్ (ఫైల్)

రోడ్లు వేయకుండానే.. బిల్లులు

- వైసీపీ సర్కారు నిర్వాకం ఇది
- సొంత పార్టీ నేతలే కాంట్రాక్టర్లు
- సహకరించిన ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారి
- విజిలెన్స్ విచారణ చేపట్టాలని గిరిజనుల డిమాండ్



రాళ్లు తేలిన చందనగిరి రహదారి

(మెళియాపుట్టి)

మెళియాపుట్టి మండలంలోని కొండలపైన ఉన్న కేరాశింగి, చందనగిరి, గూడ, అడ్డివాడ, దబ్బగూడ గ్రామాలకు 2009లో కాంగ్రెస్ ప్రభుత్వం రహదారులను మంజూరు చేసింది. దీనిపై అటవీశాఖ అధికారులు అభ్యంతరం చెప్పడంతో అప్పటి అటవీశాఖ మంత్రి శత్రుశర్ల విజయరామరాజు అనుమతులు తీసుకువచ్చారు. కానీ, నిధులు మంజూరుకాక పనులు ప్రారంభం కాలేదు. 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం.. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఈ ఐదు గిరిజన గ్రామాల రోడ్ల కోసం సుమారు రూ.5కోట్ల నిధులు మంజూరు చేసింది. దీంతో జంగిల్ క్లియరెన్స్ చేపట్టి పనులు ప్రారంభించేసరికి ఎన్నికలు రావడంతో ప్రభుత్వం మారిపోయింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం కేరాశింగి రోడ్డుకు రూ.80లక్షలు, చందనగిరికి రూ.కోటి, అడ్డివాడకు రూ.90లక్షలు మంజూరు చేసింది. ఈ పనుల కాంట్రాక్టులను స్థానిక వైసీపీ నాయకులు దక్కించుకున్నారు.

అయితే, మూడు రోజుల పాటు ఎక్స్‌కవేటర్‌తో మట్టిని చదును చేసి ఇద్దరు నేతలు సుమారు రూ.1.50కోట్ల బిల్లులు చేయించుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై గిరిజనులు ఆందోళన చేశారు. దీంతో 2024 ఎన్నికల నాటికి రోడ్లు పూర్తి చేసిన తరువాతే ఓట్లు అడగడానికి మీ వద్దకు వస్తానని అప్పటి ఎమ్మెల్యే రెడ్డిశాంతి గిరిజనులకు తెలిపారు. ఈ మేరకు ఆమె తమ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి మళ్లీ నిధులు మంజూరు చేయించారు. దీంతో కేరాశింగి రోడ్డు 2.50 కిలోమీటర్లకు గాను రూ.92 లక్షలు, చందనగిరికి పెండింగ్‌లో ఉన్న 3.10 కిలోమీటర్లకు రూ.1.25 కోట్లు, అడ్డివాడ రోడ్డు 2.30 కిలో మీటర్లకు రూ.1.75 కోట్లు, గూడకు 2.50 కిలోమీటర్లకు గాను రూ.1.50 కోట్లు మంజూరయ్యాయి. ఈ పనులను ఆరు నెలల్లో పూర్తి చేయాలని అప్పటి ఐటీడీఏ పీవో కల్పనాకుమారి ఆదేశించారు. ఈ మేరకు గతేడాది ఆగస్టులో పనులు ప్రారంభించారు. కానీ, నేటి వరకూ మట్టి పనులే చేశారు తప్ప సీసీ రోడ్లు వేయలేదు. కేవలం రోడ్లపై రాయి పిండి (క్రషర్ బుగ్గి) వేసి వదిలేశారు. దీనికి సంబంధించిన బిల్లులను ఓట్ల కౌంటింగ్‌కు మూడు రోజులు ముందు చేయించుకున్నట్లు తెలుస్తోంది. ఈ పనులను వైసీపీకి చెందిన ఓ నేత బంధువు చేయడంతో జిల్లాలో ప్రత్యేక జీవో తీసుకువచ్చి బిల్లుల మంజూరుకు అధికారులు సహకరించినట్లు తెలిసింది. దీనికి మండల పరిధిలో ఉపాధి హామీలో పనిచేస్తున్న ఒక అధికారి పూర్తిగా సహకరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై విజిలెన్స్ విచారణ నిర్వహించాలని గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై ఐటీడీఏ డీఈ శిమ్మన్న వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన స్పందించడం లేదు.



ఇటీవల కురిసిన వర్షానికి కోతకు గురైన కేరాశింగి రోడ్డు

అలా వేశారు.. ఇలా కరిగిపోయింది..

రోడ్ల పనులు పూర్తి కాకపోవడంతో గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. 15 ఏళ్లుగా పనులు జరుగుతున్నా ఇప్పటికీ పూర్తి కాకపోవడంపై ఆవేదన చెందుతున్నారు. ఇటీవల కురిసిన చిన్న వర్షాలకే కేరాశింగి, చందనగిరి రోడ్లపై ఉన్న రాయి పిండి(క్రషర్ బుగ్గి) కరిగిపోయి కోతకు గురయ్యాయి. సకాలంలో పనులు పూర్తి కాకపోవటంతోనే ఇటువంటి పరిస్థితులు ఏర్పడి నిధులు వృథా అవుతున్నాయని గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. రోడ్ల సౌకర్యం లేక రేషన్, పింఛన్లు, వైద్య సేవల కోసం ఎన్నో కష్టాలు పడి కొండలు దిగుతున్నట్లు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వంపైనే వారు ఆశలు పెట్టుకున్నారు. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లడానికి కొంతమంది గిరిజన నేతలు సిద్ధమవుతున్నారు.

కష్టాలు తప్పడం లేదు



మా గ్రామ రహదారి పనులు పూర్తయితే వాహనాలు రాకపోకలు జరిగి మా కష్టాలు తీరుతాయని భావించాం. కానీ, ఏళ్లు గడుస్తున్నా పనులు పూర్తికావడం లేదు. దీంతో కొండలు దిగి మైదాన ప్రాంతాలకు రావాలంటే కష్టంగా ఉంటుంది. వైద్యం, రేషన్, పింఛన్లు ఇలా అన్నింటికీ కొండలు దిగక తప్పడం లేదు. కొత్త ప్రభుత్వమైనా మా కష్టాలు తీర్చాలి.

- సవర లక్ష్మి, కేరాశింగి, మెళియాపుట్టి

మోసపోతున్నాం



ప్రతిసారి ఎన్నికల ముందు మా గ్రామ రోడ్డు పనులు చేస్తున్నట్లు రాజకీయ నేతలు నటించి మాతో ఓట్లు వేయించుకుంటున్నారు. ఎన్నికలకు ఆరు నెలల ముందు పనులు మొదలుపెడుతున్నారు. తరువాత వదిలేస్తున్నారు. ప్రతిసారి మేము మోసపోతున్నాం.

- సవర రాము, కేరాశింగి, మెళియాపుట్టి

విజిలెన్స్ దర్యాప్తు చేయాలి

గిరిజన గ్రామాల రహదారుల పనులు పూర్తి చేయకుండానే బిల్లులు చేయించుకున్నట్లు తెలిసింది. దీనిపై విజిలెన్స్ అధికారులతో దర్యాప్తు చేయాలి. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తాం.

-వాబ యోగి, గిరిజన సంఘం నాయకుడు

కలెక్టర్‌గా స్వప్నిల్ దినకర్ పండ్కర్

- మనజీర్ జిలానీ సమూన్‌కు బదిలీ



కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పండ్కర్

శ్రీకాకుళం, జూలై 2(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్‌గా స్వప్నిల్ దినకర్ పండ్కర్ నియమిస్తూ ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీచేశారు. ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల కలెక్టర్లను మంగళవారం సాయంత్రం బదిలీ చేసింది. విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా వ్యవహరిస్తున్న స్వప్నిల్ దినకర్ పండ్కర్‌ను బదిలీపై శ్రీకాకుళం కలెక్టర్‌గా నియమించింది. ఈయన 2016కు చెందిన ఐఏఎస్ అధికారి. గౌహతిలో ఐఐటీ కంప్యూటర్ సైన్స్‌చేసి.. ముందుగా ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. తర్వాత ఐఏఎస్ కూడా సాధించారు. కాకినాడ, విజయవాడ, నెల్లూరు ప్రాంతాల్లో మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా పనిచేశారు. నూజివీడు సబ్‌కలెక్టర్‌గా, చిత్తూరు జాయింట్ కలెక్టర్‌గా విధులు నిర్వర్తించారు. విధినిర్వహణలో మంచి పేరు సంపాదించారు. త్వరలో సిక్కోలు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు.

- సార్వత్రిక ఎన్నికలకు ముందు నంద్యాల నుంచి జిల్లాకు వచ్చిన కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్‌కు బదిలీ అయింది. ఈయనకు పోస్టింగ్ ఎక్కడ ఇచ్చారన్నదీ జాబితాలో ప్రకటించలేదు.

నిత్యావసరాల ధరల నియంత్రణకు చర్యలు

- మార్కెట్‌లో ఆకస్మిక తనిఖీలు చేయాలి
- కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్



మాట్లాడుతున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

కలెక్టరేట్, జూలై 2: నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు నియంత్రణలో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన చాంబర్‌లో.. పౌరసరఫరాలు, మార్కెటింగ్, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో ధరల నియంత్రణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నిత్యావసరాల ధరలు ఇష్టానుసారం విక్రయించకుండా మార్కెట్‌లో ఆకస్మిక తనిఖీలు చేయాలని ఆదేశించారు. కూరగాయల ధరలు పెరుగుతున్న దృష్ట్యా రైతులకు లాభదాయకంగా, వినియోగదారునికి సరసమైన ధరలకు అందించేలా సరఫరాదారులను గుర్తించి నివేదిక అందజేయాలని తెలిపారు. టమోటా, ఉల్లి తదితర వస్తువులు తక్కువ ధరల్లో రైతుబజార్లలో అందుబాటులో ఉండేలా దిగుమతి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జేసీ నవీన్, పౌరసరఫరాల అధికారి శాంతిశ్రీ, జీఎస్టీ ఏసీ రాణీమోహన్, మార్కెటింగ్ శాఖ ఏడీ నాగలక్ష్మి జ్యోతి, రైతు బజార్ ఎస్టేట్ అధికారి కె.రాజశేఖర్ పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ భేష్

అరసవల్లి: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో రాష్ట్రంలో సిక్కోలు ప్రథమ స్థానంలో నిలిచింది. రాష్ట్రంలోనే అత్యధికంగా జిల్లాలో 3,19,147 మంది పింఛన్‌దారులు ఉన్నారు. వీరిలో 3,16,632 మంది (99.21శాతం) లబ్ధిదారులకు తొలి రెండు రోజుల్లోనే అధికారులు పింఛన్లు పంపిణీ చేశారు. అధికారుల చిత్తశుద్ధితో ఈ విజయం సాధ్యమైందని, అందరికీ కలెక్టర్ అభినందనలు తెలిపారు.





- 'గడప గడపకూ' పనులకు బిల్లులు పెండింగ్
- ప్రభుత్వం మారడంతో వైసీపీ నేతల ఆందోళన

బకాయిలు వస్తాయా?

(రణస్థలం)

వైసీపీ హయాంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపులు నిలిచిపోవడంతో ఆ పార్టీ కాంట్రాక్టర్లు ఆందోళన చెందుతున్నారు. ఐదేళ్లలో వైసీపీ నేతలే కాంట్రాక్టర్లుగా వ్యవహరించి పనులు చేయించారు. చాలా పనులకు సంబంధించి చెల్లింపులు బకాయి ఉంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తమ బిల్లులు వస్తాయో?లేవోనని టెన్షన్ పడుతున్నారు. వాస్తవానికి ముందు ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులకు.. తరువాత వచ్చిన ప్రభుత్వం బిల్లులు చెల్లించడం ఆనవాయితీగా వస్తోంది. కానీ దీనికి జగన్ సర్కారు బ్రేక్ వేసింది. టీడీపీ హయాంలో 2014-19 మధ్య 'నీరు-చెట్టు' పథకంలో భాగంగా పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు బిల్లులు పెండింగ్ ఉండగా.. 2019లో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం వాటిని చెల్లించలేదు. 'నీరు చెట్టు' పథకం కింద దాదాపు ఎనిమిది వేలకుపైగా పనులు జరిగాయి. 2019 ఎన్నికల నాటికి 1,616 పనులకు సంబంధించి రూ.53 కోట్లు పెండింగ్‌లో ఉండిపోయాయి. గత ఐదేళ్లుగా కాళ్లరిగేలా తిరిగినా బిల్లులు చెల్లించలేదు. చివరకు న్యాయస్థానాలకు ఆశ్రయించినా ఫలితం లేకపోయింది. సాధారణంగా క్షేత్రస్థాయిలో జరిగే పనులకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు (ఈఈ)లు 33శాతం పనులకు నేరుగా చెక్ మెజర్‌మెంట్ చేస్తారు. కానీ 'నీరు-చెట్టు' పథకంలో శతశాతం మెజర్‌మెంట్ జరిగినా బిల్లులు ఇంత వరకూ చెల్లించలేదు. అప్పు చేసి పనులు చేయించామని.. కనీసం కోత విధించి అయినా బిల్లులు చెల్లించాలని, లేదంటే తమకు ఆత్మహత్యలే శరణ్యమని వేడుకున్నా వైసీపీ ప్రభుత్వం కనికరించలేదు. ఈసారి ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయం చెందగా.. ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చింది. కాగా.. వైసీపీ పాలనలో ఉన్న బకాయి బిల్లులు చెల్లిస్తారో లేదోనన్న సందిగ్ధం నెలకొంది.

వైసీపీ శ్రేణుల్లో టెన్షన్..

జగన్ సర్కారు అనుసరించిన పద్ధతులతో ఇప్పుడు వైసీపీ నేతల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. గత ఐదేళ్లలో సచివాలయ భవనాలు, రైతుభరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణం చేపట్టిన వైసీపీ నేతలకు రూ.కోట్లలో బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇవి చాలవన్నట్టు ఎన్నికల ముంగిటే గడపగడపకూ మన ప్రభుత్వ నిధులతో వివిధ పనులు చేపట్టారు. ప్రధానంగా కాలువలు, రహదారులు, కల్వర్టుల నిర్మించారు. కానీ వాటికి సంబంధించి బిల్లులు సైతం పెండింగ్‌లో ఉన్నాయి. ఎచ్చెర్ల నియోజకవర్గానికి 287 పనులకు సంబంధించి రూ.8.39కోట్లు మంజూరయ్యాయి. శ్రీకాకుళంలో 181 పనులకు రూ.9.62కోట్లు, ఆమదాలవలసలో 135 పనులకు రూ.4.63కోట్లు, పలాసలో 231 పనులకు రూ.7కోట్లు, నరసన్నపేటలో 236 పనులకు రూ.5.99 కోట్లు, టెక్కలిలో 99 పనులకు రూ.2.91 కోట్లు, పాతపట్నంలో 157 పనులకు రూ.5.19 కోట్లు, ఇచ్ఛాపురంలో 244 పనులకు రూ.7.88 కోట్లు మంజూరు చేశారు. వీటిలో కొన్ని పనులు పూర్తయినా.. వైసీపీ ప్రభుత్వం ఆదిగో ఇదిగో అంటూ కాలయాపన చేసి బిల్లులు చెల్లించలేదు. నాడు టీడీపీ నేతలు చేపట్టిన పనులకు జగన్ సర్కారు బిల్లులు చెల్లించలేదు. ఈ నేపథ్యంలో ఇప్పుడు తాము చేసిన పనులకు కూటమి ప్రభుత్వం బిల్లులు చెల్లించే చాన్స్ లేదని వైసీపీ నేతలే పెదవి విరుస్తున్నారు. తమ పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కౌలు రైతులకు గుర్తింపు



- కార్డుల జారీకి ప్రభుత్వ ఆదేశాలు
- గ్రామసభల ద్వారా దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం

(నరసన్నపేట)

ఖరీఫ్‌లో కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు అధికారులు గ్రామాల్లో సభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. జిల్లాలో సుమారు 13వేల మంది కౌలు రైతులు ఉన్నారు. వీరు భూ యజమానుల నుంచి పొలాన్ని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. ఎకరాకు రూ.12వేల నుంచి రూ.14వేల వరకు యజమానికి చెల్లిస్తారు. అయితే విపత్తుల సమయంలో ఇలా భూములను సాగుచేసిన రైతులకు తీవ్ర నష్టం జరిగేది. భూమి యాజమాన్య హక్కులు ఉండక పోవడంతో బ్యాంకుల నుంచి రుణాలు అందక.. వ్యవసాయ పెట్టుబడులకోసం అప్పు చేసేవారు. తీరా పంట చేతికి వచ్చిన సమయంలో విపత్తులు ఎదురైతే తీవ్రంగా నష్టపోయేవారు. ఈ నేపథ్యంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఖరీఫ్ ఆరంభంలోనే కౌలు రైతులను గుర్తించే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. మంగళవారం నుంచి గ్రామసభలు నిర్వహించి.. కౌలు రైతుల గుర్తింపునకు సంబంధించి దరఖాస్తులు స్వీకరణ ప్రారంభించింది. భూ యాజమాని హక్కులకు భంగం కలగకుండా.. కౌలు రైతులకు 11 నెలలు కాలపరిమితికి గుర్తింపు కార్డులను జారీ చేయనుంది. భూ యాజమాని అంగీకారంతోనే వీటిని ఇవ్వనుంది. ప్రతి మండలంలో రోజుకు రెండు పంచాయతీల్లో ఈ నెల 12వరకు వ్యవసాయశాఖ అధికారులు గ్రామసభలు నిర్వహించనున్నారు. రెవెన్యూ అధికారుల సమక్షంలో కౌలు రైతులకు అవగాహన కల్పిస్తారు.

- గుర్తింపు కార్డు కోసం భూ యజమాని పొలం పాస్‌బుక్, 1బీ కాపీ ఉండాలి. వీటితోపాటు భూ యజమాని, కౌలు రైతుల ఆధార్‌కార్డుల జిరాక్స్, కౌలురైతుల ఫొటోలు ఉండాలి. భూ యజమానికి ఏ సర్వే నెంబర్‌లో ఎంత భూమి కౌలుకి ఇచ్చారో వివరాలు నమోదు చేస్తూ.. ఆయన అంగీకరించినట్టు సంతకం చేసిన ధ్రువీకరణ పత్రం సమర్పించాలి.

ప్రయోజనాలివీ..

ఈ ఏడాది ఖరీఫ్, రబీకి సంబంధించి పొలం కౌలు సాగుచేసే ప్రతీ రైతులు తప్పనిసరిగా కౌలు గుర్తింపు కార్డు(సీసీఆర్‌సీ) తీసుకోవాలి. కౌలుదారులకు గుర్తింపు కార్డు ఉంటే పంట నమోదుకు వీలు ఉంటుంది. తద్వారా ప్రభుత్వ పథకాలు.. భూ యాజమానులతో పాటు కౌలు రైతులకు కూడా వర్తిస్తాయి. బీసీ, ఎస్టీ, ఎస్సీ, మైనార్టీలకు చెందిన కౌలు రైతులకు గుర్తింపు కార్డు ఉంటే రైతుభరోసాకు అర్హులు. పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవచ్చు. పంట నష్టం జరిగితే.. పరిహారం, బీమా పొందేందుకు వీలుంటుంది.



బొరిగివలసలో అధికారుల గ్రామసభ

మహిళను చంపేసి.. ఆటోలో తరలించి..



రాజేశ్వరి (ఫైల్)

- పోలీసుస్టేషన్‌లో లొంగిపోయిన నిందితుడు
- సన్నిహిత సంబంధమే కారణం

పొందూరు, జూలై 2: పొందూరు మండలం తాడివలస సమీపంలో చినబొడ్డేపల్లి గ్రామానికి చెందిన అమలాపురపు రాజేశ్వరి(32) దారుణ హత్యకు గురైంది. ఆమెను చంపేసి మృతదేహాన్ని ఆటోలో పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చి నిందితుడు లొంగిపోయాడు. స్థానిక పోలీసుల వివరాల మేరకు.. చినబొడ్డేపల్లికి చెందిన అమలాపురపు రాజేశ్వరి భర్త గుప్తేశ్వరరావు మూడేళ్ల కిందట అనారోగ్యంతో మృతిచెందాడు. అప్పటి నుంచి రాజేశ్వరి తన కుమార్తెతో కలిసి చినబొడ్డేపల్లిలోని తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. కిరాణా దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తోంది. రెండు నెలల కిందట బొడ్డేపల్లి రైల్వేట్రాక్ పనుల కోసం వచ్చిన నరసన్నపేట మండలం ఉర్లాం గ్రామానికి చెందిన అముజూరు గోపాల్‌తో ఆమెకు పరిచయం ఏర్పడింది. ఇది ఇద్దరి మధ్య సన్నిహిత సంబంధానికి దారి తీసింది. మంగళవారం సంతకవిటి మండలం వాల్తేరులో శుభకార్యానికి వెళ్లడానికి సిద్ధమైన రాజేశ్వరి.. గోపాల్‌కు ఫోను చేసింది. గోపాల్ ఆటోపై చినబొడ్డేపల్లికి వచ్చాడు. ఇద్దరూ ఆటోలో వాల్తేరుకు బయలుదేరారు. అయితే మార్గమధ్యంలో ఏమైందోగానీ తాడివలస సమీపాన ఇద్దరి మధ్య వివాదం చోటుచేసుకుంది. గోపాల్ తనతో తెచ్చుకున్న చాకుతో రాజేశ్వరి మెడపై పలుమార్లు దాడిచేశాడు. దీంతో రాజేశ్వరి అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని గోపాల్ ఆటోలో స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి లొంగిపోయాడు. ఆమదాలవలస సీఐ దివాకర్‌యాదవ్ స్టేషన్‌కు వచ్చి విచారణ చేపట్టారు. హతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. నిందితుడు గోపాల్‌తో కలిసి హత్యజరిగిన ప్రాంతానికి వెళ్లి దర్యాప్తు చేపట్టారు. హత్యకు గల కారణాలను విచారిస్తున్నారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

దిక్సూచి
DIKSUCHI

ఏపీ టెట్ నోటిఫికేషన్

మంగళగిరిలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాల విద్య విభాగం- 'ఆంధ్రప్రదేశ్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(ఏపీ టెట్) 2024' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, మండల పరిషత్, జిల్లా పరిషత్, మున్సిపాలిటీ పాఠశాలలు సహా ఆదర్శ పాఠశాలలు, గురుకుల పాఠశాలలు, సంక్షేమ పాఠశాలలు, ప్రైవేట్ ఎయిడెడ్/అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటోతరగతి నుంచి ఎనిమిదోతరగతి ఉపాధ్యాయుల ఎంపికకు టెట్ అర్హత తప్పనిసరి. రాష్ట్రంలో మెగా డీఎస్సీ నిర్వహించనున్న నేపథ్యంలో ఈ నోటిఫికేషన్ వెలువడింది.

టెట్ వివరాలు

- ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. ఇందులో 1ఎ, 1బి, 2ఎ, 2బి అనే నాలుగు పేపర్లు ఉంటాయి. రెగ్యులర్ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి అయిదో తరగతి వరకు బోధించాలనుకునేవారు 1ఎ పేపర్‌ను, ఆరోతరగతి నుంచి ఎనిమిదోతరగతి వరకు బోధించాలనుకునేవారు 2ఎ పేపర్‌ను రాయాలి. స్పెషల్ ఎడ్యుకేషన్ స్కూళ్లలో ఒకటోతరగతి నుంచి అయిదో తరగతి వరకు బోధించాలనుకునేవారు 1బి పేపర్‌ను, ఆరోతరగతి నుంచి ఎనిమిదోతరగతి వరకు బోధించాలనుకునేవారు 2బి పేపర్‌ను రాయాలి. టెట్ ఎగ్జామ్‌లో అర్హత సాధించాలంటే జనరల్ అభ్యర్థులకు కనీసం 60 శాతం మార్కులు; బీసీ అభ్యర్థులకు కనీసం 50 శాతం మార్కులు; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు కనీసం 40 శాతం మార్కులు రావాలి. రాష్ట్ర ప్రభు త్వం నిర్వహించే టీచర్ రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో ఏపీ టెట్ స్కోర్‌కు 20 శాతం వెయిటేజీ ఉం టుంది. ఒక అభ్యర్థి ఎన్నిసార్లయినా టెట్ రాయవచ్చు. టెట్ స్కోర్ వ్యాలిడిటీ జీవితకాలం ఉం టుంది.
- ప్రతి పేపర్లో 150 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. పరీక్ష సమయం రెండున్నర గంటలు. ప్రశ్నపత్రం ఇంగ్లీష్, అభ్యర్థి ఎంచుకొన్న లాంగ్వేజ్‌లలో ఉంటుంది.
- 1ఎ పేపర్లో చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాగి, లాంగ్వేజ్-1, ఇంగ్లీష్‌లాంగ్వేజ్, మేథమెటిక్స్, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్ అంశాల నుంచి ఒక్కోదానిలో 30 ప్రశ్నలు అడుగుతారు.
- 1బి పేపర్లో చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాగి-స్పెషల్ ఎడ్యుకేషన్, లాంగ్వేజ్-1, ఇంగ్లీష్ లాంగ్వేజ్, మేథమెటిక్స్, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్ అంశాల నుంచి ఒక్కోదానిలో 30 ప్రశ్నలు ఇస్తారు.



- 2ఎ పేపర్లో చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాగి, లాంగ్వేజ్-1, ఇంగ్లీష్ అంశాల నుంచి ఒక్కోదానిలో 30 ప్రశ్నలు ఇస్తారు. మేథమెటిక్స్, బయలాజికల్ సైన్స్, ఫిజికల్ సైన్స్ అంశాలు లేదా సోషల్ స్టడీస్ లేదా లాంగ్వేజ్ నుంచి 60 ప్రశ్నలు ఇస్తారు.
- 2బి పేపర్లో చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాగి-స్పెషల్ ఎడ్యుకేషన్, లాంగ్వేజ్-1, ఇంగ్లీష్ లాంగ్వేజ్ అంశాల నుంచి ఒక్కోదానిలో 30 ప్రశ్నలు; డిజెబిలిటీ స్పెషలైజేషన్ అండ్ పెడగాగి నుంచి 60 ప్రశ్నలు ఇస్తారు.
- లాంగ్వేజ్-1 కింద తెలుగు, ఉర్దూ, హిందీ, ఇంగ్లీష్, కన్నడ, తమిళం, ఒడియా, సంస్కృతం భాషల్లో ఒకదాన్ని ఎంచుకోవాలి.

- **దరఖాస్తు ఫీజు:** రూ.750
- **ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** జూలై 16
- **దరఖాస్తు దాఖలుకు చివరి తేదీ:** జూలై 17
- **ఆన్‌లైన్ మాక్ టెస్ట్‌లు:** జూలై 16 నుంచి
- **హాల్ టికెట్ డౌన్‌లోడింగ్:** జూలై 25 నుంచి
- **ఏపీ టెట్ 2024 తేదీలు:** ఆగస్టు 5 నుంచి 20 వరకు
- **ప్రాథమిక 'కీ'ల విడుదల:** ఆగస్టు 10 నుంచి
- **'కీ'పై అభ్యంతరాల స్వీకరణ:** ఆగస్టు 11 నుంచి 21
- **ఫైనల్ కీ విడుదల:** ఆగస్టు 25
- **ఫలితాలు విడుదల:** ఆగస్టు 30
- **వెబ్‌సైట్:** http://cse.ap.gov.in

ఎవరు రాయొచ్చంటే..

- 1ఎ పేపర్ రాయాలంటే ఏపీ బీఐఈ నుంచి 50 శాతం మార్కులతో ఇంటర్/తత్సమాన కోర్సు ఉత్తీర్ణతతోపాటు రెండేళ్ల 'డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్'(డీఈఎల్ఈడీ)/నాలుగేళ్ల 'బ్యాచిలర్ ఆఫ్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్'(బీఈఎల్ఈడీ)/రెండేళ్ల 'డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్-స్పెషల్ ఎడ్యుకేషన్' పూర్తిచేసి ఉండాలి. ద్వితీయశ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఎల్ఈడీ) పూర్తిచేసినవారు కూడా అర్హులే.
- 1బి పేపర్ రాయాలంటే ఏపీ బీఐఈ నుంచి 50 శాతం మార్కులతో ఇంటర్/తత్సమాన కోర్సు ఉత్తీర్ణతతోపాటు రెండేళ్ల 'డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్'(డీఈడీ)-'స్పెషల్ ఎడ్యుకేషన్' పూర్తిచేసి ఉండాలి. ఏడాది 'డిప్లొమా ఇన్ స్పెషల్ ఎడ్యుకేషన్'(డీఎస్ ఈ) ఉత్తీర్ణులు; 'డిప్లొమా ఇన్ కమ్యూనిటీ బేస్డ్ రిహాబిలిటేషన్'(డీసీబీఆర్)/'డిప్లొమా ఇన్ మల్టీ రిహాబిలిటేషన్ వర్కర్'(ఎంఆర్‌డబ్ల్యూ)/'డిప్లొమా ఇన్ హియరింగ్ లాంగ్వేజ్ అండ్ స్పీచ్'(డీహెచ్ఎల్ఎస్)/'డిప్లొమా ఇన్ ఒకేషనల్ రిహాబిలిటేషన్-మెంటల్ రిటార్డేషన్'(డీవీఆర్-ఎంఆర్)/'డిప్లొమా ఇన్ ఒకేషనల్ ట్రెయినింగ్ అండ్ ఎంప్లాయిమెంట్-మెంటల్ రిటార్డేషన్'(డీవీటీఈ-ఎంఆర్)/పీజీ డిప్లొమా ఇన్ కమ్యూనిటీ బేస్డ్ రిహాబిలిటేషన్(పీజీడీసీబీఆర్) ఉత్తీర్ణతతో పాటు ఆర్నెల్ల సర్టిఫికెట్ కోర్సు(ఎడ్యుకేషన్ ఆఫ్ చిల్డ్రన్-స్పెషల్ నీడ్స్) పూర్తిచేసినవారు; జూనియర్ డిప్లొమా ఇన్ టీచింగ్ డెఫ్ ఉత్తీర్ణులు; ప్రైమరీ లెవెల్ టీచర్ ట్రెయినింగ్ కోర్స్ ఇన్ విజువల్ ఇంపైర్‌మెంట్ పూర్తిచేసినవారు కూడా అర్హులే.
- 2ఎ పేపర్ రాయాలంటే డిగ్రీ/పీజీతోపాటు బీఈడీ పూర్తిచేసి ఉండాలి. ఇంటర్ ఉత్తీర్ణతతోపాటు నాలుగేళ్ల బీఈఎల్ఈడీ ఉత్తీర్ణులు; ఏదేని డిగ్రీతోపాటు ఏడాది వ్యవధి గల బీఈడీ(స్పెషల్ ఎడ్యుకేషన్) పూర్తిచేసిన వారు; 55 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణతతోపాటు మూడేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఈడీ-ఎంఈడీ పూర్తిచేసినవారు కూడా అర్హులే.
- 2బి పేపర్ రాయాలంటే డిగ్రీ/పీజీతోపాటు బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ పూర్తిచేసి ఉండాలి. బీఈడీ(జనరల్)తోపాటు ఏడాది డిప్లొమా-స్పెషల్ ఎడ్యుకేషన్/పీజీ డిప్లొమా-స్పెషల్ ఎడ్యుకేషన్ ఉత్తీర్ణులు; బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్‌తోపాటు పీజీ ప్రొఫెషనల్ సర్టిఫికెట్ ఇన్ స్పెషల్ ఎడ్యుకేషన్ ఉత్తీర్ణులు; పీజీ డిప్లొమా ఇన్ స్పెషల్ ఎడ్యుకేషన్-మెంటల్ రిటార్డేషన్ ఉత్తీర్ణులు; సెకండరీ లెవెల్ టీచర్ ట్రెయినింగ్ కోర్స్ ఇన్ విజువల్ ఇం పైర్‌మెంట్ పూర్తిచేసినవారు; సీనియర్ డిప్లొమా ఇన్ టీచింగ్ డెఫ్ ఉత్తీర్ణులు; బీఏ-బీఈడీ ఇన్ విజువల్ ఇంపైర్‌మెంట్ పూర్తి చేసినవారు కూడా అర్హులే.
- లాంగ్వేజ్ టీచర్లు మాత్రం లాంగ్వేజ్ సబ్జెక్టులో డిగ్రీ లేదా బ్యాచిలర్ ఆఫ్ ఓరియంటల్ లాంగ్వేజ్ పూర్తిచేసి ఉండాలి. డిగ్రీ ఇన్ లిటరేచర్; పీజీ(లాంగ్వేజ్ సబ్జెక్ట్)తోపాటు లాంగ్వేజ్ పండిట్ ట్రెయినింగ్ సర్టిఫికెట్ ఉత్తీర్ణులు; బీఈడీ (లాంగ్వేజ్) పూర్తిచేసినవారు కూడా అర్హులే.

SCHOLARSHIP ALERT

Description: Swami Vivekanand Scholarship for Academic Excellence Scheme 2024 (formerly Rajiv Gandhi Scholarship) is an initiative of the Government of Rajasthan, for students planning to pursue undergraduate, postgraduate, Ph.D., and post-doctoral research programs abroad.

Swami Vivekanand Scholarship for Academic Excellence Scheme 2024

Eligibility: Applicants must be Indian citizens residing in Rajasthan, pursuing a UG, PG, Ph.D. or postdoctoral program, and be under 35 years old on July 1st of the financial year. Applicants must meet the specified income criteria to be eligible for the scholarship.

Prizes & Rewards: A monthly living expenses of up to 1,00,000 and other benefits

Last Date: 15-01-2025 *Application:* Online

Short Url: www.b4s.in/ aj/RGAE1

Kotak Junior Scholarship

Description: Under the CSR initiative on Education & Livelihood by the Kotak Mahindra Group Companies, Kotak Education Foundation invites applications for Kotak Junior Scholarship 2024-25 from Class 10 passed students within the Mumbai Metropolitan Region.



Eligibility: Applicants must have obtained over 85% marks in their Class 10 board examination (SSC/CBSE/ICSE) in 2024.

- They must have secured admission in Class 11 at junior colleges/schools for Arts, Commerce or Science streams in the Mumbai Metropolitan Region (MMR) for the academic year 2024-25.
- The annual family income of applicants must be INR 3,20,000 or below.
- Students must reside within the Mumbai Metropolitan Region (MMR).

Prizes & Rewards: Scholarship of INR 3,500 per month along with mentorship support, academic assistance, career guidance, and exposure visits.

Last Date to Apply: 15-07-2024

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/KJSP2

TOEFL India Championship

Description: An initiative of ETS India Private Limited to help undergraduate students and working professionals pursue their dream of studying abroad.

Eligibility: Participants must currently be enrolled in the 3rd or 4th year of undergraduate studies at an accredited Indian higher education institution (college or university). Additionally, applicants who have completed their undergraduate or graduate studies in India and are seeking higher education abroad, or those with up to two years of verifiable professional work experience, are also eligible to apply.

Prizes & Rewards: Total prize money of 15 lacs

Last Date to Apply: 31-07-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/TOIC1


buddy4study.com

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/oYryGaKలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

15 రోజుల షూట్‌తో పూర్తి

'గేమ్ ఛేంజర్' చిత్రం మరో 15 రోజుల షూటింగ్ మాత్రమే మిగిలి ఉంది. 'భారతీయుడు 2' రిలీజవ్వగానే పెండింగ్ పార్ట్‌ను పూర్తి చేస్తాను. 'గేమ్‌చేంజర్', 'భారతీయుడు' చిత్రాల మధ్య పోలిక లేదు. అవి రెండూ పూర్తిగా వేటికవే భిన్నమైనవి. సీక్వెల్ చేయడానికి అవసరమైన మలుపులు 'గేమ్ ఛేంజర్' కథలో లేవు కాబట్టి అలాంటి ప్రయత్నమేదీ చేయడం లేదు' అని దర్శకుడు శంకర్ అన్నారు. ఆయన దర్శకత్వంలో కమల్‌హాసన్ కథానాయకుడిగా నటించిన 'భారతీయుడు 2' చిత్రం ఈనెల 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా శంకర్ మీడియాతో ముచ్చటించారు.





శంకర్

- 'భారతీయుడు' చిత్రానికి మూడో పార్ట్ కూడా ఉంది. మరో ఆరునెలల్లో దాన్ని కూడా విడుదల చేస్తాం. పలు రాష్ట్రాల్లో జరిగే కథ కావడంతో నిడివి పెరిగింది. ప్రతి సన్నివేశం ప్రేక్షకులను కట్టి పడేస్తుంది. ఎడిటింగ్‌లో ఒక్క సన్నివేశం కూడా తీసేయడానికి నా మనసు ఒప్పుకోలేదు. అందుకనే 'భారతీయుడు 3' ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాం.
- భవిష్యత్‌లో జేమ్స్‌బాండ్ తరహా చిత్రాలు చేయాలనుకుంటున్నాను. అలాగే చారిత్రక, సైన్స్ ఫిక్షన్ కథాంశాలతో సినిమాలు చేసే ఆలోచన ఉంది. వీఎఫ్ఎక్స్‌ను ఉపయోగించుకొని మంచి చిత్రాలు తెరకెక్కించే ఆలోచన ఉంది. ఆ సినిమాలు అందరినీ ఆశ్చర్యపరిచే స్థాయిలో ఉంటాయి.
- శంకర్ సినిమాటిక్ యూనివర్స్ క్రియేట్ చేయాలనే ఆలోచన వచ్చింది. దాని గురించి నా స్నేహితులు, సహాయ దర్శకులు, కుటుంబ సభ్యులకు చెప్పినప్పుడు ఎవ్వరూ పెద్దగా ఎగ్జైట్ అవ్వలేదు. దాంతో ఆ ఆలోచన విరమించుకున్నాను. రజనీకాంత్, కమల్‌హాసన్‌తో మల్టీస్టారర్ ప్లాన్ చేశా. కానీ కమల్ హాసన్ బిజీగా ఉండడంతో కుదరలేదు.
- ఇప్పుడు సినిమాల్లో టెక్నాలజీ బాగా ఎక్కువైంది. దాంతో అద్భుతాలు సృష్టించవచ్చు. కానీ నా దృష్టిలో ఏఐ కన్నా మనిషి ఆలోచనలే శక్తిమంతమైనవి. ఇప్పుడే కాదు ఎప్పటికీ ఏఐ కన్నా మనిషి ఆలోచనలే ముందుంటాయి.
- తప్పకుండా షారూఖ్‌ఖాన్‌తో సినిమా చేస్తాను. మంచి స్క్రిప్ట్ కుదరాలి. అట్లీ, లోకేశ్ కనగరాజ్ లాంటి దర్శకులు సృజనాత్మకంగా చిత్రాలను తెరకెక్కిస్తున్నారు. 'ట్వల్త్ ఫెయిల్' చిత్రం నాకు బాగా నచ్చింది.

అపరిచితుడు రీమేక్‌ను పక్కనపెట్టాం



రణ్‌వీర్‌సింగ్‌తో హిందీలో 'అపరిచితుడు' రీమేక్ చిత్రం లేనట్టే. ప్రస్తుతానికి ఆ చిత్రాన్ని పక్కనపెట్టినట్లు బాలీవుడ్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో శంకర్ చెప్పారు. ఆ చిత్ర నిర్మాత జయంతిలాల్ గడ నాతో 'అపరిచితుడు' రీమేక్ కన్నా మరింత భారీ చిత్రం తీయాలనుకోవడమే దానికి కారణమని శంకర్ తెలిపారు. 'ఈ రీమేక్‌ను ప్రకటించాక కొత్త కాన్సెప్ట్‌లతో పలు పాన్ ఇండియా చిత్రాలు వచ్చాయి, మంచి విజయాన్ని అందుకొన్నాయి. దాంతో మా నిర్మాత మనసు మార్చుకున్నారు. ప్రస్తుతానికైతే 'అపరిచితుడు' రీమేక్‌ను పక్కనపెట్టినట్లే. చేతిలో ఉన్న సినిమాలు పూర్తి చేశాక దీనిపై ఓ నిర్ణయం తీసుకుంటాం' అని శంకర్ చెప్పారు.

కష్టంతోనే అదృష్టం



మన వంతు కష్టపడాలి, అప్పుడే అదృష్టం కూడా కలసి వస్తుంది అని నమ్ముతాను అన్నారు రష్మిక మందన్న. సినిమా జయాపజయాలపై తన ఆలోచనా ధోరణి గురించి చెబుతూ 'టీంలో ప్రతి ఒక్కరూ శ్రమిస్తేనే మంచి అవుట్‌పుట్ వస్తుంది. అప్పుడే సినిమా పెద్ద హిట్ అవుతుంది. హీరో, హీరోయిన్ దర్శకుడు... ఇలా నటీనటులు మొదలుకొని ప్రతి టెక్నీషియన్ సినిమా కోసం ముందస్తుగా సన్నద్ధమయ్యేందుకు చాలా కష్టపడతారు. ఈ క్రమంలో ప్రతి ఒక్కరూ చాలా ఒత్తిడిని ఎదుర్కోవాల్సి వస్తుంది. ఎంత కష్టపడినా కొన్ని సార్లు అపజయం తప్పదు. అలాంటప్పుడు ఇంత కష్టపడినా ఇలా జరిగిందేంటి అని బాధపడకూడదు. కష్టాన్ని నమ్ముకొని ముందుకెళ్లాలి, అప్పుడే విజయాలు మన సొంతమవుతాయి' అని రష్మిక చెప్పారు. ప్రస్తుతం ఆమె తెలుగులో ధనుష్, నాగార్జున మల్టీస్టారర్ 'కుబేర'లో కథానాయికగా నటిస్తున్నారు. శేఖర్ కమ్ముల దర్శకత్వం వహిస్తున్నారు. రష్మిక లుక్‌ను ఈ నెల 5న విడుదల చేస్తున్నట్లు యూనిట్ తెలిపింది. సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్‌రావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

మా మధ్య అసూయ లేదు



తమిళ నటులు రజనీకాంత్, కమల్‌హాసన్ వెండితెరపై కలసి నటిస్తే చూడాలని కోరుకోని అభిమాని లేడంటే అతిశయోక్తి కాదు. ఈ నెల 12న విడుదలవుతున్న 'భారతీయుడు 2' ప్రమోషన్స్‌లో ఉన్న కమల్‌ను.. ఓ ఆంగ్ల మీడియా విలేఖరి 'ఇండియన్ సినిమా చరిత్రలోనే అత్యంత పాపులర్ నటులయిన మీ ఇద్దరూ కలసి నటించి ఎన్నో ఏళ్లు అవుతోంది. మళ్లీ మిమ్మల్ని ఒకే తెరపై చూసే అవకాశం ఉందా.. ఒకరి సినిమాల్లో ఒకరు కనిపించే ఆలోచనలు ఉన్నాయా?' అని ప్రశ్నించారు. దీనికి కమల్ సమాధానమిస్తూ 'మాది కొత్త కాంబినేషన్ అయితే కాదు. కెరీర్ కొత్తలో మేమిద్దరం ఎన్నో సినిమాల్లో కలసి నటించాం. ఆ సమయంలోనే ఇక కలసి ఒకే సినిమాలో కనిపించకూడదని నిర్ణయించుకున్నాం. మేం ఇద్దరం ఏ విషయంలో పోటీపడలేదు, ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోలేదు. అప్పుడూ.. ఇప్పుడూ. ఎందుకంటే మేం ఇద్దరం ఒకే గురువు కె.బాలచందర్ దగ్గర శిక్షణ పొందాం. మా మధ్య అసూయకు తావు లేదు. ఒకరి ఎదుగుదలను ఇంకొకరం స్పోర్టివ్‌గా తీసుకుని ముందుకు సాగుతున్నాం. ఇదే మా మధ్య ఉన్న బలమైన అనుబంధానికి నిదర్శనం. మాకు 20 ఏళ్లు ఉన్నప్పటి నుంచే ఇలాంటి అవగాహనతో కెరీర్‌లో ముందుకు సాగుతున్నాం' అని రజనీతో ఉన్న స్నేహాన్ని గుర్తుచేసుకున్నారు. కాగా, కమల్,రజనీ కలసి దాదాపు 16 చిత్రాల్లో నటించారు. ఆఖరిగా, 1985లో తెరకెక్కిన అమితాబ్ బచ్చన్ చిత్రం 'గిరఫ్తార్'లో స్క్రీన్ షేర్ చేసుకున్నారు.

విరాజి టైటిల్‌తో వరుణ్ సందేశ్




ఇటీవలే విడుదలైన 'నింద' చిత్రంతో హీరోగా చక్కటి విజయాన్ని సొంతం చేసుకున్నారు వరుణ్ సందేశ్. త్వరలో తన కొత్త చిత్రం 'విరాజి'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆద్యంత్ హర్ష దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఎమ్ 3 మీడియా బేనర్‌పై మహేంద్రనాథ్ కూండ్ల నిర్మిస్తున్నారు. మంగళవారం చిత్రబృందం టైటిల్ అనౌన్స్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా వరుణ్ సందేశ్ మాట్లాడుతూ "నింద' సక్సెస్ నాకు మంచి ఉత్సాహాన్ని ఇచ్చింది. హర్ష చెప్పిన కథ బాగా నచ్చింది. ఆయనకు మంచి భవిష్యత్ ఉంది. నా 17 ఏళ్ల కెరీర్‌లో చేయని ఒక డిఫరెంట్ మూవీ ఇది. ఇందులో నా పాత్ర సరికొత్తగా ఉంటుంది' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'త్వరలో ఫస్ట్‌లుక్‌ను విడుదల చేస్తాం. 'విరాజి' వరుణ్ సందేశ్‌కు పేరు తెస్తుంది' అని చెప్పారు. నిర్మాత మాట్లాడుతూ "విరాజి' చిత్రంలో వరుణ్ సందేశ్‌ను కొత్త అవతారంలో చూపించబోతున్నాం. సినిమా చాలా బాగా వచ్చింది. ఆగస్టు 2న విడుదల చేయాలనుకుంటున్నాం' అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: ఎబినేజర్ పాల్. సినిమాటోగ్రఫీ: జీవీ అజయ్‌కుమార్. ఎడిటర్: రామ్ తూము

భారతీయ సినిమాకు అవార్డుల పంట

సుచి తలాటి దర్శకత్వంలో బాలీవుడ్ నటి రిచా చద్దా, ఫయాజ్ అలీ నిర్మించిన 'గర్ల్స్ విల్ బి గర్ల్స్' చిత్రం రిలీజ్‌కు ముందే సంచలనాలు సృష్టిస్తోంది. ఇప్పటికే పలు అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో అవార్డులు గెలుచుకున్న ఈ చిత్రం ఇప్పుడు మరో అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ లాస్ ఏంజిల్స్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన గ్రాండ్ జ్యూరీ అవార్డును సాధించి చరిత్ర సృష్టించింది. ఈ సినిమా ఇప్పటికే రొమేనియాలోని ట్రాన్సిల్వేనియా ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్, ఫ్రాన్స్‌లోని బియారిట్జ్‌లోని ఫిల్మ్ ఫెస్టివల్స్‌లోనూ గ్రాండ్ జ్యూరీ అవార్డులను కైవసం చేసుకుంది. ఇలా వరుసగా మూడు గ్రాండ్ జ్యూరీ అవార్డులు సాధించి హ్యాట్రిక్ సాధించింది. ఈ సందర్భంగా నిర్మాతలు రిచా చద్దా, ఫయాజ్ అలీ మాట్లాడుతూ 'ఇలా ఒక నెలలోనే ఈ సినిమాకు మూడు గ్రాండ్ జ్యూరీ పురస్కారాలు దక్కడంతో చాలా ఆనందంగా ఉంది. ఇది మా కష్టానికి దక్కిన గౌరవం. మా హృదయాలకు చేరువైన ఈ సినిమా.. ఇంతటి ఘనమైన ప్రదర్శన చేస్తుండడం జీవితాంతం మర్చిపోలేని విషయం. ఒక నిర్మాతగా మొదటి సినిమాకే ఇంత ఖ్యాతి రావడం మా అదృష్టం' అని చెప్పారు. కాగా, 16 ఏళ్ల అమ్మాయి జీవితంలో జరిగే సంఘటనల ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రంలో ప్రీతి పాణిగ్రాహి ప్రధాన పాత్రలో నటించారు.



షారుక్ ఖాన్‌కు అరుదైన గౌరవం



బాలీవుడ్ నటుడు షారుక్ ఖాన్‌కు అరుదైన గౌరవం లభించింది. స్విట్జర్లాండ్‌లోని లోకర్నో ఫిల్మ్ ఫెస్టివల్‌ను నిర్వహించే అక్కడి జ్యూరీ సభ్యులు.. షారుక్ ఖాన్‌ను ఈ ఏడాది జరిగే ఫిల్మ్ ఫెస్టివల్‌లో సత్కరించనున్నారు. షారుక్‌కు 'జీవిత సాఫల్య పురస్కారం' ప్రకటించింది. అంతే కాకుండా.. ఆయన సినిమాల్లో క్లాసికల్ హిట్‌గా మిగిలిన 'దేవదాసు' సినిమాను కూడా ఆ ఫిల్మ్ ఫెస్టివల్‌లో స్క్రీనింగ్‌కు ఎంపిక చేసింది. సంజయ్ లీలా భన్సాలీ దర్శత్వంలో 2003లో రిలీజైన ఈ సినిమా విమర్శకులు ప్రశంసలతో పాటు బాక్సాఫీస్ వద్ద బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచింది. ఈ అవార్డుకు సంబంధించిన వివరాలను సోషల్ మీడియాలో ప్రకటించిన ఈ ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వాహకులు.. షారుక్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. 'షారుక్ లాంటి దిగ్గజ నటుడ్ని మా ఫిల్మ్ ఫెస్టివల్‌కు ఆహ్వానించాలనే కోరిక ఈ 77వ ఎడిషన్ ఫిల్మ్ ఫెస్టివల్‌తో తీరింది. నిర్మాతగా, నటుడిగా భారతీయ సినిమా ఇండస్ట్రీపై తనదైన ముద్ర వేసిన ఆయన్ని సత్కరించడం మా గౌరవం'. కాగా, ఈ ఫిల్మ్ ఫెస్టివల్ స్విట్జర్లాండ్‌లో వచ్చే నెల 7 నుంచి 17వ తేదీ వరకు జరుగుతుంది. ఈ అవార్డును షారుక్ ఆగస్టు 10న అందుకోనున్నారు.



రాజ్‌తరుణ్ మాస్ హీరోగా నిలబడతాడు

ఇంతవరకూ వినోదభరితమైన పాత్రలతో అందరినీ నవ్వించిన యువ కథానాయకుడు రాజ్ తరుణ్ ఇప్పుడు పవర్‌ఫుల్ యాక్షన్ చిత్రం 'తిరగబడరా సామీ' తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. మాల్వీ మల్హోత్రా కథానాయికగా నటించారు. ఎ.ఎస్.రవికుమార్ దర్శకత్వంలో మల్కాపురం శివకుమార్ నిర్మించారు. ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేసిన సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో రాజ్‌తరుణ్ మాట్లాడుతూ 'అందరం ప్రాణం పెట్టి ఈ సినిమా చేశాం. ముఖ్యంగా డీవోపీ జవహర్‌రెడ్డి అద్భుతంగా చిత్రాన్ని తీర్చిదిద్దారు. సినిమాలో ఇంత యాక్షన్ పార్ట్ చేయడం నాకు కొత్త. అయినా దర్శకుడి ప్రోత్సాహంతో ఈజీగా చేశాను. ఇందులో ఎమోషన్, ఎంటర్‌టైన్‌మెంట్ కూడా బాగుంటాయి. ఈ సినిమాలో నటించే అవకాశం ఇచ్చిన నిర్మాత శివకుమార్‌కు నా ధన్యవాదాలు' అని చెప్పారు. 'నేను దర్శకత్వం వహించిన 'యజ్ఞం' చిత్రం ఇదే రోజున విడుదలై నా జీవితాన్ని కొత్త మలుపు తిప్పింది. అదే ఈ రోజున 'తిరగబడరా సామీ' ట్రైలర్ విడుదల కావడం ఆనందంగా ఉంది. రాజ్‌తరుణ్ ఈ సినిమాతో మాస్ హీరోగా నిలబడతాడు. నిర్మాత చాలా గ్రాండ్‌గా సినిమాని తీశారు. అందరినీ ఆకట్టుకొనే చిత్రమిది' అని చెప్పారు రవికుమార్. 'ఇందులో బాలకృష్ణ అభిమానిగా నటించా. చాలా బ్యూటిఫుల్ కథ ఇది. సినిమాలో ఓ ఫైట్ కూడా చేశా. ఈ చిత్రంతో తెలుగులో పరిచయం కావడం ఆనందంగా ఉంది' అన్నారు హీరోయిన్ మాల్వి. నిర్మాత శివకుమార్ మాట్లాడుతూ 'రవికుమార్ చెప్పిన కథ బాగా నచ్చింది. ఇందులో రాజ్‌తరుణ్ హీరోగా నటిస్తే బాగుంటుందని ఆయన్ని అడిగితే వెంటనే అంగీకరించారు. యాక్షన్ పాత్రలో ఆయన కొత్తగా కనిపిస్తారు. ప్రతి సినిమాతో నేను కొత్తవారిని పరిచయం చేస్తుంటాను. ఈ సినిమాతో హీరోయిన్ మాల్వి పరిచయమవుతోంది. త్వరలో సినిమాను విడుదల చేస్తాం' అని చెప్పారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/zzc1i8G లో చదవండి.

కూటమి ప్రభుత్వంలో ఉద్దానం కిడ్నీ ఆసుపత్రికి మహర్దశ

● పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస: పలాస కిడ్నీ ఆసుపత్రి, పరిశోధన కేంద్రానికి మహర్దశ తీసుకువస్తామని ఎమ్మెల్యే గౌతు శిరీష స్పష్టం చేశారు. మంగళవారం పద్మనాభపురం గ్రామం వద్ద ఉన్న కిడ్నీ పరిశోధన కేంద్రం, 200 పడకల ఆసుపత్రిని సందర్శించి రోగులకు అందించే సేవలను పరిశీలించారు. 2018 నవంబరు 5న నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆసుపత్రి నిర్మాణానికి వేసిన శిలాఫలకాన్ని ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం కిడ్నీ ఆసుపత్రి నిర్మాణం చేపట్టింది తప్ప ఎటువంటి సదుపాయాలు కల్పించకుండానే ప్రారంభించారని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చిన నేపథ్యంలో కిడ్నీ పరిశోధన కేంద్రం-200 పడకల ఆసుపత్రికి పూర్తిస్థాయిలో సదుపాయాలు కల్పించి వ్యాధిగ్రస్తులకు సేవలు అందిస్తామన్నారు. ఉద్దానం కిడ్నీ వ్యాధులపై పరిశోధనలు జరుగుతాయని, సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హయాంలో ఇది పూర్తవుతుం దన్నారు. అనంతరం వైద్యాధికారులతో సమీక్షించి వ్యాధిగ్రస్తులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఆమె వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ అల్లు పద్మజ, డీన్ కె.మోహన్‌బాబు, టీడీపీ నాయకులు లొడగల కామేశ్వరరావు యాదవ్, గాలి కృష్ణారావు, పీరుకట్ల విఠల్‌రావు, టంకాల రవి శంకర్ గుప్తా, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, మల్లా శ్రీనివాస్, గురిటి సూర్యనారాయణ, జోగ మల్లి పాల్గొన్నారు.



రోగులకు అందిస్తున్న సేవలపై వైద్యాధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

ప్రభుత్వ టౌన్‌షిప్‌పై ఎమ్మెల్యే సమీక్ష

పలాస: స్థానిక జాతీయరహదారి బొడ్డపాడు వద్ద సుడా లే అవుట్‌పై ఇంజనీరింగ్ అధికారులతో ఎమ్మెల్యే గౌతు శిరీష మంగళవారం తన చాంబర్‌లో సమీక్షించారు. సుడా వైస్ చైర్మన్ ఓబులేసు, ప్లానింగ్ అధికారి టీజీ రామ్మోహన్, జిల్లా టౌన్‌ప్లానింగ్ అధికారి కిషోర్ కుమార్, పబ్లిక్‌హెల్త్ ఈఈ సుగుణాకర్ ప్లాన్ వివరాలను వివరించారు. నిబంధనల ప్రకారం ప్లాట్లుగా విభజించి కేటాయించడం జరుగుతుందని, ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఈ సందర్భంగా శిరీష మాట్లాడుతూ.. రైతులందరికీ నష్టపరిహారం చెల్లించి స్థలాలు సేకరించారా లేదా అని ప్రశ్నించారు. భూమి చదును కోసం ఎంత మేరకు నిధులు వెచ్చిస్తున్నారు, ఆ ప్రాంతంలో ఇంకా ప్రభుత్వ నిర్మాణాలు చేస్తారా లేదా, రహదారులు వెడల్పు తది తర అంశాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పలాస పార్టీ ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకన్నచౌదరి, పీరుకట్ల విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావుయాదవ్, గాలి కృష్ణారావు, ఎం.నరేంద్ర(చిన్ని) పాల్గొన్నారు.

క్రీడాకారుడికి ఎమ్మెల్యే అభినందన

వజ్రపుకొత్తూరు: మన ప్రాంతానికి మరింత పేరును తీసుకువచ్చేలా క్రికెట్ ఆటను కొనసాగించాలని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. రామకృష్ణాపురానికి చెందిన దున్న వెంకటేశ్వరరావు బ్లైండ్ క్రికెట్ టీంకు ఇండియా తరపున ప్రాతినిధ్యం వహిస్తూ మంగళ వారం ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా ఆయనను ఎమ్మెల్యే అభినందించారు. మరిన్ని విజయాలు సాధించాలని కోరారు. కార్యక్ర మంలో మాజీ సర్పంచ్‌లు గోవింద పాపారావు, దున్న షన్ముఖరావు, చింత నారాయణ పాల్గొన్నారు. రేషన్ డీలర్ల సంఘం నేతలు తవి టయ్య, కామేశ్వరరావు ఎమ్మెల్యే శిరీషని కలిసి అభినందించారు.

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించండి

హరిపురం: ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మందస మండలం యూటీఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే గౌతు శిరీషను కలిసి సమస్యలను వివరించి వినతిపత్రం అందించారు. పెండింగ్‌లోని సమస్యలను ప్రాధాన్యతా పరంగా పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సమస్యలన్నింటినీ సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషిచేస్తా మన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయ కులు గుంట కోదండరావు, గున్న రమేష్, జగదీష్ బడిత్య, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'ఎత్తిపోతల'కు నిధులు మంజూరు చేయాలి

హిరమండలం: మజ్జిగూడెం ఎత్తిపోతల పథకం నిర్మాణం పూర్తిచేసేందుకు నిధులు మంజూరు చేయాలని మాజీ సర్పంచ్ గోళ్ళ సింహాచలం ఆధ్వర్యంలో అక్కురాపల్లి, పిండ్రువాడ, చిన్నకిట్టాలపాడు పంచాయతీల గిరిజన రైతులు కోరారు. ఈ మేరకు పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. మజ్జిగూడెం ఎత్తిపోతల పథకానికి 2018లో టీడీపీ ప్రభుత్వం రూ.976.64 లక్షల అంచనాతో టెండర్‌కు పిలిచి పనులు చేసేం దుకు కాంట్రాక్టర్‌కు అప్పగించారన్నారు. శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించినా ఆ తరువాత వైసీపీ ప్రభుత్వం రావడంతో బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నిలిచిపోయాయన్నారు. ఎత్తిపోతల పథకం నిర్మాణం పూర్తి చేస్తే ఈ ప్రాంతంలో 729 ఎకరాల మెట్ట భూములు సాగులోకి వస్తాయన్నారు. తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కె.నీలవేణి పాల్గొన్నారు.



ఎమ్మెల్యే గోవిందరావుకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

సామాజిక భవనం మంజూరు చేయండి

జలుమూరు, జూలై 2: విశ్వబ్రాహ్మణుల అవసరాలకు మండల కేంద్రంలో సామాజిక భవనం మంజూరు చేయాలని విశ్వబ్రాహ్మణ పంచవృత్తుల సహకార సేవా సంఘం నేతలు కోరారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘ నేతలు మాట్లాడుతూ.. ప్రతీ నెల సమావేశాలు, వేడుకలు నిర్వహించేందుకు ఇబ్బం దులు ఎదురవుతున్నాయన్నారు. భవన నిర్మాణానికి స్థలం, నిధులు మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. వృత్తిపనులు చేపట్టి దుమ్ము, ధూళితో ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నామని, 50 సంవత్సరాలకే పింఛన్ వర్తించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యేని కలిసిన వారిలో చల్లవానిపేట, లింగాలవలస సర్పంచ్‌లు పంచిరెడ్డి రామచంద్రరావు, దుంగ స్వామిబాబు, సంఘం అధ్యక్షుడు వీరస్వామి, ఉపాధ్యక్షులు అప్పలరాజు, దమరసింగు చంద్రరావు తదితరులు పాల్గొన్నారు. ● అల్లాడ గ్రామంలో మంగళవారం నిర్వహించిన విజయోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అల్లాడలోని సమస్యలు పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమలో టీడీపీ నాయకులు హనుమంతు రంగనాథం, సనపల రమణ, కింజరాపు సత్యం, దుద్దు రాజేశ్వరరావు పాల్గొన్నారు.

గుండివిల్లిపేటలో ప్రత్యేక పూజలు

నరసన్నపేట: గుండివిల్లిపేట గ్రామంలో శ్రీలలితా చంద్రమౌళీశ్వర స్వామి ఆలయ వార్షికోత్స వం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి కల్యాణాన్ని ఆలయ అర్చకుడు వనమాలి రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో చేపట్టారు. విఘ్నేశ్వరపూజ, ధ్వజారోహణం, రక్షాసూత్రధారణ అనం తరం కల్యాణం నిర్వహించారు. ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే దంపతులు

రామలింగంనాయుడుకాలనీ(పోలాకి): మబగాంలోని చిన్నమ్మతల్లి అమ్మవారిని మంగళవారం ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి దంపతులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కాలనీ వాసులంతా వారిని సత్కరించారు. ఆయన మాట్లాడుతూ.. గతంలో చిన్నమ్మతల్లి అమ్మవారి ఆలయ నిర్మాణానికి కృషి చేశానన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కల్పన, గ్రామపెద్ద కాయ రవి, తదితరులు పాల్గొన్నారు.



పోలాకి: బగ్గు దంపతులను సత్కరిస్తున్న గ్రామస్థులు

గ్యాస్ సరఫరా నిలిచిపోయి ఇబ్బందులు

పాతపట్నం: స్థానిక డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల ఆశ్రమ పాఠశాలకు గ్యాస్ సరఫరా నిలిచిపోయిందని, దీంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ప్రిన్సిపాల్ వి.అర్చన తెలిపారు. ఈ మేరకు సిబ్బందితో కలిసి ఎమ్మెల్యే మామిడి గోవిందరావును మంగళవారం కలిసి సమస్యను విన్నవించారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ గ్యాస్ ఏజెన్సీ డీలర్‌తో మాట్లాడి ప్రభుత్వం నుంచి బిల్లులు వచ్చేలా చర్యలు తీసుకుంటానని, లేకుంటే సొంతంగా ఆ మొత్తం చెల్లిస్తానని, తక్షణం గ్యాస్‌ను సరఫరా చేయాలని సూచించారు. కేర్‌టేకర్ వై.సునీత, వై.సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జలుమూరు: చల్లవానిపేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో తిమడాం ఫీడర్‌పై ఉన్న గ్రామాలకు బుధవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు టెక్కలి విద్యుత్ ఈఈ జి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌డీఎస్‌ఎస్ పనుల్లో భాగంగా అధిక లోడ్ ఫీడర్లను విడగొట్టే పనులు చేపడుతున్నామన్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం 8 గంటలు నుంచి సాయంత్రం 5 గంటలు వరకు శ్రీముఖలింగం, కరకవలస, అచ్యుతాపురం, బైదలాపురం, తిమడాం, పర్లాం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పింఛన్ పంపిణీపై వాగ్వాదం

పలాస: పురుషోత్తపురం కాలనీలో మునిసిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు అనుచరుడు, వలంటీరు తండ్రి కురత్తల్వార్ స్వామికి చెందిన పింఛన్ పంపిణీ విషయంలో చైర్మన్ బల్ల గిరిబాబు, టీడీపీ నాయకుల మధ్య వాగ్వాదం, తోపులాటకు ఏర్పడింది. వివరాలిలా ఉన్నాయి.. చైర్మన్ అనుచరుడు గదాధర్ తండ్రికి సంబంధించిన వృద్ధాప్య పింఛన్ సోమవారం ఇవ్వాల్సి ఉంది. మధ్యాహ్నం వరకు ఇవ్వకపోవడంతో ఉద్దేశపూర్వకంగా తన తండ్రి పింఛన్‌ను నిలిపివేశారని వలంటీర్ తండ్రి పేరుతో సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. ఈ విషయం చైర్మన్ దృష్టికి వెళ్లడంతో సంబంధిత సచివాలయ ఉద్యోగులు, కమిషనర్ దృష్టికి తీసుకు వెళ్లడంతో పింఛన్ సాయంత్రం అందించారు. ఈ వ్యవహారంపై గిరిబాబు పురుషోత్తపురం కాలనీలో కౌన్సిలర్ కుమారుడు, టీడీపీ పట్టణ కార్యదర్శి సప్ప నవీన్‌ను ప్రశ్నించడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. మంగళవారం చైర్మన్ తన అనుచరులతో వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే తనపై చైర్మన్ దురుసుగా వ్యవహరించారని నవీన్ కూడా కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదుచేశారు. చైర్మన్, ఆయన సోదరుడిని అడ్డుకున్నాను తప్ప దాడి చేయలేదని దీనిపై నీలి మీడియా విష ప్రచారం చేస్తోందని నవీన్ ఆరోపించారు. చైర్మన్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ విజయానంద్ తెలిపారు.



వాదించుకుంటున్న గిరిబాబు, నవీన్

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వర ఆలయ వార్షికోత్సవం

కాశీబుగ్గ: కాశీబుగ్గ ఎల్‌సీ గేటు సమీపంలోని పంచముఖ ఆంజనేయ ఆలయ ఆవరణలోని సుబ్రహ్మణ్యేశ్వర ఆలయం 3వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు, హోమాలు చేపట్టారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో అర్చకులు బుద్ధిరామ్ పాత్రో, రాజేష్ పండా, ధర్మకర్త సదాశివుని వరలక్ష్మి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

99 శాతం పింఛన్ల పంపిణీ

మందస: మందస మండలంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు 99 శాతం పంపిణీ చేసినట్లు ఎంపీడీవో ఎ.రఘుపతిరావు తెలిపారు. 11,693 పింఛన్లకు గాను 11,575 పింఛన్లు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. ● **పలాసరూరల్:** పలాస మండలంలో పింఛన్లు 99శాతం పంపిణీ చేసినట్లు ఎంపీడీవో మెట్ట వైకుంఠరావు తెలిపారు. 6,366 పింఛన్లకు గాను 6,311 పింఛన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు.

రట్టి తీరంలో ఎలుగుబంట్ల జలకాలాట

హరిపురం: మందస మండలం రట్టి సముద్ర తీరంలో రెండు ఎలుగు బంట్లు (తల్లి, పిల్ల) జలకాలాడుతూ మంగళవారం కనిపించాయి. దీంతో తీరానికి సేద తీరేందుకు వెళ్లిన పలువురు సందర్శకులు భయాందోళనతో వెనుదిరిగారు. కొందరు యువత రాళ్లపైకి ఎక్కి వీడియో తీశారు. పిల్లల ఎలుగు కావడంతో ప్రమాదమని స్థానికులు హెచ్చరించడంతో వారు వెళ్లిపోయారు. కొంత సమయం తరువాత ఎలుగులు సైతం సమీపంలోని జీడి తోటల్లోకి వెళ్లిపోయాయి. ఎండవేడిమి, ఉక్కపోతకు గురై ఇలా సముద్రంలో జలకాలాడాయని స్థానికులు తెలిపారు.



కర్లెమ్మలో పారిశుధ్య పనుల పరిశీలన

కొత్తూరు: కర్లెమ్మ పంచాయతీలో జలజీవన్ మిషన్, పారిశుధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలని టెక్కలి డీఎల్పీవో ఐవీ రమణ పేర్కొన్నారు. సర్పంచ్ లోతుగెడ్డ భగవాన్‌దాసు నాయుడుతో పాటు గ్రామంలో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. కాలువల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ పోతల మణికంఠ, పంచాయతీ కార్యదర్శి సింగిరెడ్డి రామనారాయణ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ లోతుగెడ్డ హిమగిరి తదితరులున్నారు.

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు

మెళియాపుట్టి: పెద్దమడి గురుకుల కళాశాలలో ఇంటర్ మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ మధు తెలిపారు. ఎంపీసీలో ఒకటి, బైపీసీలో 4, సీఈసీలో 14 సీట్లు ఖాళీ లున్నాయన్నారు. ఆసక్తి ఉన్న గిరిజన విద్యార్థులు ఈనెల 8వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పెంటపోలమ్మ అమ్మవారికి చల్లదనం

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ 11వ వార్డులో మంగళవారం పెంటపోలమ్మ అమ్మవారి చల్లదనం ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారిని గజముద్ద రూపంలో తయారు చేసి పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు. సాయంత్రం గజముద్దతో గ్రామ దేవతల ఆలయాలకు వెళ్లి ముగ్రాటలు పోసి చల్లదనం చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని కోరుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ పలాస నియోజకవర్గ సమన్వయకర్త వెంకన్నచౌదరి, టీడీపీ మాజీ కౌన్సిలర్ చంద్రశేఖర్ త్యాడి, పూజా కమిటీ సభ్యులు నిత్యానంద్ పండా, సంతోష్‌కుమార్ పండా, దేవేంద్ర త్యాడి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కిల్లిపోలమ్మ తల్లి ఉత్సవాలు

టెక్కలి: మేజర్‌పంచాయతీ టెక్కలి గొల్లవీధిలో మూడురోజులుగా నిర్వహిస్తున్న కిల్లిపోలమ్మతల్లి ఉత్సవాలు మంగళవారం రాత్రితో ముగిశాయి. ఈ ఉత్సవాల్లో చివరిరోజు రాత్రి కిల్లిపోలమ్మతల్లి ఆలయం నుంచి పెద్దఎత్తున అమ్మవారి ఊరేగింపు నిర్వ హించారు. మహిళలు అధిక సంఖ్యలో ఘటాలను పట్టుకొని తిరువీధిలో పాల్గొన్నారు. ఉత్సవకమిటీ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను నిర్వహించారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

బోరుభద్ర-విశాఖ ఆర్టీసీ సర్వీసు పునః ప్రారంభం

టెక్కలి/సంతబొమ్మాళి: సంతబొమ్మాళి మండలంలోని తీరప్రాంత ప్రజలు విశాఖ వెళ్లేందుకు గాను టెక్కలి-బోరుభద్ర-విశాఖ ఆర్టీసీ సర్వీసును మంగళవారం పునః ప్రారంభించారు. 20 ఏళ్ల కిందట దివంగత నేత కింజరాపు ఎర్రన్నాయుడు విశాఖ సర్వీసును ప్రారంభించగా వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరు వాత కలెక్షన్ లేదంటూ నిలిపివేశారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎన్నికలకు ముందు సమస్యను స్థానికులు కింజ రాపు అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకువెళ్లగా ఆయన హామీ ఇచ్చారు. ఈ మేరకు సోమవారం ఆర్టీసీ అధికారులను ఆదేశించగా మంగళవారం నుంచి సర్వీసును పునరుద్ధరించారు. టెక్కలిలో టీడీపీ మండల అధ్యక్షుడు బగాది శేషగిరిరావు ప్రారంభించగా బోరుభద్రలో ఐటీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి అప్పిన వెంకటేష్, జిల్లా తెలుగుయువత నాయకుడు వజ్జ ప్రభాకర్ బస్సు సర్వీస్‌కు స్వాగతం పలికారు. బస్సు సర్వీస్ పునఃప్రారంభం కావడంతో ఈ ప్రాంత వాసులకు ఎంతో సౌకర్యం గా ఉంటుందని టీడీపీ నాయకులు పంగ రమణ, టీఎస్ఎన్ రమణ, దల్లి ప్రసాద్‌రెడ్డి, రెయ్యి ప్రీతీష్, భూషణ్, ఇప్పిలి జగదీష్, కోరాడ రాంప్రసాద్, చంద్రారెడ్డి, సూరాడ ధన రాజ్, కర్రి రామిరెడ్డి, పరపటి రాజశేఖర్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.



బస్సుకు జెండా ఊపి ప్రారంభిస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు శేషగిరి

కౌలు రైతుల గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తులు

మెళియాపుట్టి: కౌలు రైతుల గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని పలాస వ్యవసాశాఖ ఏడీ లింగాల మధుబాబు అన్నారు. మంగళవారం గొప్పిలి, గోకర్ణపురం గ్రామాల్లో రైతులతో గ్రామసభలు నిర్వహించారు. సీసీఆర్ కార్డులున్న వారికి ప్రభుత్వ పథకాలు అందుతాయ న్నారు. కార్డుదారులకు 11 నెలలు కాలపరిమితం ఉంటుందన్నారు. రైతులు సహకరించా లన్నారు. వీఏఏలకు దరఖాస్తులు అందించాలన్నారు. కార్యక్రమంలో ఏవో దానకర్ణుడు తదితరులు పాల్గొన్నారు. ● **పెద్దకోట(ఎల్.ఎన్.పేట):** గ్రామాల్లో రైతులవద్ద కౌలుకు తీసుకున్న రైతులను ప్రభుత్వ నిబంధనల మేరకు కౌలు రైతులుగా గుర్తించడం జరుగుతుందని వ్యవసాయాధికారి పి.లతాశ్రీ తెలిపారు. పెద్దకోట, లక్ష్మినర్సుపేట గ్రామాల్లో మంగళవారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కౌలురైతు గుర్తింపుకార్డు కలిగివున్న వారికే ప్రభుత్వం నుంచి పథకాలు వర్తిస్తాయన్నారు. సమావేశంలో సర్పంచ్ ఎం.దివాకర్‌నాయుడు, ఎంపీడీవో ఎస్.మోహనరావు, ఆర్ఐ ఎస్.గవరయ్య, వీఆర్వో ఎం.రామప్పుడు పాల్గొన్నారు. ● **నందిగాం:** కౌలురైతులు సాగు రైతు ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా పొందాలని తహసీల్దార్ వి.పద్మావతి, వ్యవసాయాధికారి పి.శ్రీకాంత్‌వర్మ అన్నారు. మంగళవారం దిమ్మిడిజోల, కల్లాడ గ్రామా ల్లో కౌలురైతు అవగాహనా సదస్సులు నిర్వహించారు. కౌలురైతు కార్డులతో అనేక ప్రయోజనాలు న్నాయన్నారు. కార్డు పొందడం ద్వారా ప్రభుత్వ పథకాలతో పాటు రుణాలు, రాయితీలు పొంద వచ్చన్నారు. కార్యక్రమంలో ఏఈవో కె.గణపతిరావు, రైతులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేసే వారికి గుర్తింపు

నరసన్నపేట: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసే వారికి గుర్తింపు వస్తుందని ఎంఈవోలు ఉప్పాడ శాంతారావు, పేడాడ దాలినాయుడు అన్నారు. మంగళవారం తామరాపల్లి పాఠశాలలో ఇటీవల పదవీ విరమణ పొందిన సిద్దా వెంకట పర్వతరావును సత్కరించారు. విద్యార్థులను సక్రమంగా తీర్చి దిద్దడంలో పర్వతరావు ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



పర్వతరావు దంపతులను సత్కరిస్తున్న ఎంఈవోలు, గ్రామస్థులు

రేపటి విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

టెక్కలి: విద్యా సమస్యల పరిష్కారానికి గాను గురువారం నిర్వహించనున్న రాష్ట్ర వ్యాప్త విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు డి.చందు అన్నారు. మంగళవారం బంద్‌కు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉన్నత విద్య మాత్రమే కాకుండా పాఠశాల విద్యాపరిస్థితి దారుణంగా ఉందని, విద్యారంగానికి బడ్జెట్ కేటాయింపుల్లో కోత పడిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను తగ్గించారన్నారు. విద్య ప్రజాస్వామ్యంపై దాడికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా కేజీ నుంచి పీజీ వరకు విద్యాసంస్థల బంద్‌కు పిలుపునివ్వడం జరిగిందన్నారు. నీట్ పరీక్షలు రాసి నష్టపోయిన విద్యార్థులకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దుర్గాప్రసాద్, తరుణ్ పాల్గొన్నారు.

ఇసుకను సరఫరా చేయాలి

టెక్కలి: భవన నిర్మాణాలకు సంబంధించి ఇసుకను తక్షణం సరఫరా చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి అనపాన షణ్ముఖరావు అన్నారు. మంగళవారం టెక్కలిలో విలేకరులతో మాట్లాడుతూ.. ఇసుక కొరత వల్ల కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం చొరవ చూపి ఇసుక సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు లను పునరుద్ధరించాలని, జిల్లా, రాష్ట్రస్థాయి కమిటీలు తక్షణమే ఏర్పాటు చేయాలన్నారు. సంఘ నాయకులు పోలారావు, సామ కృష్ణ పాల్గొన్నారు.

'కింజరాపు' కుటుంబంతోనే రైతు సంక్షేమం

సంతబొమ్మాళి: కింజరాపు కుటుంబంతోనే రైతు సంక్షేమం సాధ్యమని పీఏసీఎస్ మాజీ అధ్యక్షు డు ఆట్టాడ రాంప్రసాద్ అన్నారు. మంగళవారం మర్రిపాడు 12ఆర్ వంశధార కాలువలో పూడికతీత పనులను ప్రారంభించారు. స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పింఛన్ అందజేత



టెక్కలి: బ్రెయిన్ సర్జరీ చేసుకున్న జానకమ్మకు పింఛన్ అందజేస్తున్న దృశ్యం



పోలాకి: చికిత్స పొందుతున్న సూరమ్మకు నగదు అందిస్తున్న విజయలక్ష్మి

టెక్కలి: టెక్కలి మండలం పెద్దసాన పంచాయతీ లక్ష్మీపురానికి చెందిన చల్లా జానకమ్మ విశాఖ లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో బ్రెయిన్ సర్జరీ చేయించుకొని చికిత్స పొందుతోంది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పింఛన్ మొత్తం పెంచి రూ.7 వేల నగదును గ్రామ సచివాలయ ఉద్యోగి గిరి సహాయంతో స్థానిక టీడీపీ కార్యకర్తలు అల్లు తులసి, చమళ్ల వినోద్, బడగల మనోజ్, బాలక ఆది ఆసుపత్రికి వెళ్లి జానకమ్మకు అందజేశారు. ● **పోలాకి:** జడూరు గ్రామానికి చెందిన కొండాల సూరమ్మ అనారోగ్యంతో శ్రీకాకుళం ఆసుపత్రిలో చికత్స పొందుతోంది. ఆమెకు వచ్చిన పెంచిన పింఛన్ రూ.7 వేలను జడూరు ఇంజ నీరింగ్ అసిస్టెంట్ బి.విజయలక్ష్మి శ్రీకాకుళం వెళ్లి అందజేశారు. దీంతో ఆమె ఆనందం వ్యక్తంచేస్తూ సీఎం చంద్ర బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ● **హరిపురం:** మందస మండలం హరిపురం దండాశి వీధికి చెందిన రోకళ్ల ఈశ్వరి అనారోగ్యంతో బాధపడుతూ నాలుగు రోజులుగా శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతోంది. ఆమెకు పెంచిన వితంతు పింఛన్ మొత్తాన్ని ఎంపీడీవో రఘు పతిరావు ఆదేశాల మేరకు కార్యదర్శి జగదీష్, సర్వేయర్ మహంతి గోపినాథ్ ఆసుపత్రికి వెళ్లి అందించారు. దీంతో ఆమె హర్షం వ్యక్తంచేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ● **కొత్తూరు:** కలిగాం గ్రామానికి చెందిన ఎన్ని పోలి నాయుడు అనారోగ్యంతో శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. ప్రభుత్వం పెంచిన పింఛన్ మొత్తాన్ని బకాయిలతో కలిపి మంగళవారం సర్పంచ్ సనపల కోటి, విలేజ్ సర్వేయర్ అల్లు తిరుపతిరావు రిమ్స్‌కి వెళ్లి రూ.7 వేలు అందించారు.



హరిపురం: శ్రీకాకుళం రిమ్స్‌లో పింఛన్‌ను అందజేస్తున్న మహంతి గోపినాథ్



కొత్తూరు: పోలినాయుడుకు పింఛన్ అందిస్తున్న దృశ్యం

ఎస్‌బీఐ సాంస్కృతిక ఉత్సవాల్లో 'పెద్దింటి'కి ప్రశంస

పాతపట్నం: ముంబైలో ఎన్‌సీపీఏ ఆడిటోరియంలో ఎస్‌బీఐ కార్పొరేట్ సెంటర్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి జరిగిన బ్యాంకిడే ఉత్సవాల్లో పాతపట్నం ఎస్‌బీఐ ఉద్యోగి పెద్దింటి మోహన్‌దాస్ చేపట్టిన సాంస్కృతిక ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా ఎస్‌బీఐ చైర్మన్ దినేష్ కుమార్ ఖారా జ్ఞాపికను అందించి అభినందించారు. మోహన్‌దాస్ నటించిన సూక్ష్మ అకౌంట్స్ నిర్వా హణపై హిందీభాషలో రూపొందించిన షార్ట్ ఫిల్మ్ అందరి మన్ననలు పొందింది. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

నష్టపోయిన మత్స్యకారులను ఆదుకోండి


పాతపట్నం: అగ్నిప్రమాదంలో నష్టపోయిన మత్స్యకారులను ఆదుకోవాలని కొరసవాడ నీలమణి దుర్గ మత్స్యకారుల సంఘ సభ్యులు మాజీ సర్పంచ్ మడ్డు రామారావు ఆధ్వర్యంలో తహసీల్దార్ ప్రసాదరావును కోరారు. ఈ మేరకు మంగళవారం వినతి పత్రం అందించారు. కొరసవాడలో రాజుల చెరువులోని చేపలను విక్రయించుకుంటూ జీవనం సాగిస్తున్నామని, ఈ ఏడాది ఎండలు ఎక్కువగా ఉండడంతో చెరువు గట్టుపై పాక వేసి వలలను అందులో ఉంచుకున్నామన్నారు. అయితే ఇటీవల అగ్నిప్రమాదం జరిగి వలలన్నీ కాలి బూడిదయ్యాయని ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు తాటికొండ లక్ష్మి, పి.కుమారి, నెమలపురి రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీముఖలింగేశ్వరునికి గ్రామోత్సవం

జలుమూరు: శ్రీముఖలింగంలోని శ్రీముఖలింగేశ్వరస్వామి గ్రామోత్సవం మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సాయంత్రం ఉత్సవ మూర్తులను పల్లకిపై వేంచేపు చేసి గ్రామంలో తిరువీధి మహోత్సవం చేపట్టారు. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఈవో పి.ప్రభాకరరావు, పలువురు అర్చకులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధితో జీసీసీ డీలర్ మృతి

పాతపట్నం: ఎస్.జగన్నాథపురం గ్రామ జీసీసీ డీలర్ తెంబూరు బాబూరావు (45) మంగళ వారం మృతి చెందారు. ఈయన కొంతకాలంలో కిడ్నీ వ్యాధితో బాధపడుతూ శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందు తూ మంగళవారం మృతిచెందారు. మృతుడికి భార్య, 4వ తరగతి చదు వుతున్న కుమార్తె జ్ఞానేశ్వరి, 2వ తరగతి చదువుతున్న కుమారుడు చరణ్ ఉన్నారు.



బాబూరావు(ఫైల్)



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి చర్యలు

● శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి: మత్స్యకారుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. మంగళవారం శ్రీకాకుళంలోని మత్స్యశాఖ కార్యాలయంలో మత్స్యకారుల సమస్యలు, తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో సమీక్షించారు. గ్రామీణ, గార మండలాల్లో అధిక తీర ప్రాంతం ఉన్నా, సరైన సదుపాయాలు లేకపోవడంతో మత్స్యకారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.మినీ జెట్టి నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాలని చెప్పారు. పిజిపేట తీరప్రాంతం కోతకు గురవుతోందని, నాగావళి నది సముద్రంలో కలిసే చోట రక్షణ గోడ నిర్మాణానికి అవకాశాలను పరిశీలించి ప్రణాళికలు తయారుచేయాలని మత్స్యశాఖ, ఇంజనీరింగ్, ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. మత్స్యశాఖ డీడీ శ్రీనివాసరావు, ఎస్ఈ తిరుమలరావు, ఇరిగేషన్ ఎస్ఈ సుధాకర్, మత్స్యశాఖ అధికారులు పాల్గొన్నారు. కాగా గొండు శంకర్ దంపతులు బలగ, చింతాడలో గ్రామదేవతలు, అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు.

పాలపోలమ్మ ఆలయ అభివృద్ధికి కృషి

● ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్

ఆమదాలవలస: పాలపోలమ్మ ఆలయఅభివృద్ధికి కృషిచేస్తానని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని పాలపోలమ్మ తల్లి అమ్మవారిని ఎమ్మెల్యే కూన రవికుమార్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. టీడీపీ కార్యాలయం నుంచి అమ్మవారి ఆలయం వరకు కుటుంబసభ్యులతో కలిసి ఘటాలను తీసుకొచ్చి అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతోనే విజయంసాధించానన్నారు.కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ప్రమీల, కుటుంబ సభ్యులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.కాగా రవికుమార్‌ను పట్టణభవానీ దీక్షా కమిటీ అధ్యక్షుడు పాతిన రమణమూర్తి ఆధ్వర్యంలో సభ్యులు చింతాడ సూరిబాబు, పాతిన వెంకటరాజు, కోట్ని జయపతి, కంచరాన లోకేష్ సన్మానించారు.



పాలపోలమ్మకు పూజలు నిర్వహిస్తున్న రవికుమార్



పాత కొజ్జిరియాలో పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే అశోక్

ఇచ్చిన మాట నెరవేర్చిన వ్యక్తి చంద్రబాబు

● ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్

కవిటి: రాష్ట్ర ప్రజలకు ఎన్నికలల్లో ఇచ్చిన మాటను నెరవేర్చిన వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ తెలిపారు. మంగళవారం మండలంలోని పాతకొజ్జిరియాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల అభ్యున్నతి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని తెలిపారు. గ్రామాల్లో అభివృద్ధి పనులను దశల వారీగా చేపడతామని చెప్పారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు, టీడీపీ నేతలు మణిచంద్ర ప్రకాష్, ఎస్‌వీ రమణ, భీమారావురౌళో, ఎం.కాశీప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

● ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు

జి.సిగడాం: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) తెలిపారు. మంగళవారం రౌతుపేట, ముక్కుపేట, జాడ గ్రామాల్లో తాగునీటి కొళాయిలను ప్రారంభించారు. జాడలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు కిట్‌లను, రైతులకు రాయితీపై విత్తనాలను పంపిణీ చేశారు. తహసీల్దార్ ఉమామహేశ్వరరావు, ఎంపీడీవో వెంకన్న బాబు, డూమా పీడీ చిట్టిరాజు, డీఈ సూర్యనారాయణ, ఈఏలు రమేష్, బి.భాగ్యలక్ష్మి, తిరుపతిరావు, ఎంఈవోలు ఎ.రవి, శ్రీనివాసరావు, ఏవో శారద, ఏపీవో సత్యనారాయణ,నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి విశ్వక్సేన్, పిసిని జగన్నాథం, కుమరాపు రవికుమార్, వజ్జపర్తి రఘురాం పాల్గొన్నారు.



స్టూడెంట్ కిట్లు పంపిణీ చేస్తున్న ఎన్ఈఆర్

హామీలు అమలుకావు.. అవస్థలు తప్పవు

● ఉన్నత విద్యకు దూర ప్రాంతాలకు వెళ్తున్న వైనం ● కలగా మారిన కళాశాల ఏర్పాటు
● కూటమి ప్రభుత్వంపై విద్యార్థుల ఆశలు ● ఇదీ సరుబుజ్జిలిలో పరిస్థితి



కళాశాలలకు వెళ్లేందుకు సరుబుజ్జిలి బస్టాండ్‌లో విద్యార్థుల పాట్లు

సరుబుజ్జిలి: సరుబుజ్జిలిలో డిగ్రీ కళాశాల ఏర్పాటు కలగా మారింది. ప్రతి ఎన్నికల్లో ప్రజా ప్రతినిధులు ఇస్తున్న హామీలు అమలుకు నోచుకోవడం లేదు. దీంతో విద్యార్థులకు అగచాట్లు తప్పడంలేదు. ఇక్కడ డిగ్రీకళాశాల మంజూరుకోసం మండలంతోపాటు పరిసర మండలాలకు చెందిన విద్యార్థులు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్నారు. ఇక్కడ డిగ్రీ కళా శాల లేకపోవడంతో ఉన్నత విద్యకోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని తల్లిదండ్రులు చెబుతున్నారు. కొంతమంది విద్యార్థినులు దూర ప్రాంతాలకు వెళ్లలేక ఇంటర్‌తో చదువు నిలిపి వేస్తున్నామని వాపోతు న్నారు. ఈనేపథ్యంలో ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సరుబుజ్జిలిలో డిగ్రీ కళాశాల ఏర్పాటుపై ఆశలు రేకెత్తాయి.

హామీలు నెరవేరక..

సరుబుజ్జిలి, ఎల్ఎన్‌పేట, బూర్జ, జలుమూరు మండలాలకు చెందిన వందలాది మంది విద్యార్థులు డిగ్రీ చదవడానికి దూర ప్రాంతాలకు వెళ్లాల్సివస్తోంది. ప్రతి ఎన్నికల్లో ఇక్కడ కళాశాల ఏర్పాటుపై ప్రజా ప్రతినిధులు హామీలు ఇస్తున్నా, ఆ తర్వాత విస్మరిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. కళాశాల మంజూరుపై ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, విద్యాశాఖాధికారులు స్పందించకపోవడంతో పేద విద్యార్థులు మధ్యలోనే చదువు నిలిపివేస్తున్నారు. నాలుగు మండలాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలతోపాటు ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో ఇంటర్ పూర్తిచేసిన విద్యార్థులు నరసన్నపేట, పాలకొండ, ఆమదాలవలస, శ్రీకాకుళం తదితర పట్టణ ప్రాంతాల్లో డిగ్రీ చదవడానికి రావాల్సివస్తోంది. ఈ నేపథ్యంలో 2019 శాసనసభ్యుడిగా ఎన్నికై స్పీకర్‌గా తమ్మినేని సీతారాం బాధ్యతలు చేపట్టిన తర్వాత సరుబుజ్జిలిలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు హామీఇచ్చినా నెరవేరలేదని పలువురు వాపోతున్నారు.మండల వ్యవస్థ ఏర్పడి 35 సంవత్సరాలు పూర్తవుతున్నా డిగ్రీ కళాశాల ఏర్పాటు కాకపోవడంపై సర్వత్రా విమర్శలొస్తున్నాయి.

అరకొరగా బస్సులతో..

సరుబుజ్జిలిలో డిగ్రీ కళాశాల లేకపోవడంతో ప్రతిరోజూ విద్యా ర్థులకు అగచాట్లు తప్పడం లేదు. శ్రీకాకుళం వంటి దూర ప్రాంతా ల్లోని కళాశాలలకు చేరుకోవడానికి ఉదయం ఏడు గంటలకే గ్రామీణప్రాంత విద్యార్థులు బయలు దేరాల్సివస్తోంది. ఆర్టీసీ బస్సుల కోసం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై గంటల కొద్ది వేచి ఉండాల్సివస్తోంది. ఈ రూట్‌లో అరకొరగా బస్సులు తిరుగుతుండడంతో కిక్కిరిసి ప్రయాణించాల్సివస్తోంది. దీంతో భయాందోళన చెందుతున్న తల్లిదండ్రులు విద్యార్థినులను చదువులు మానిపించేస్తున్నారు. సరుబుజ్జిలిలో 20 సంవత్సరాల కిందట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేసినా, డిగ్రీ కళాశాల మంజూరు చేయడంలో నిర్లక్ష్యం చూపుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.ఆమదాలవలస పట్టణంలో ప్రభుత్వం డిగ్రీ కళా శాలతోపాటు ప్రైవేటు డిగ్రీ కళాశాల ఉన్నప్పటికీ కొత్తగా మంజూ రైన మరో ప్రభుత్వ డిగ్రీ కళాశాల అదే మండలంలోని తొగరాం వంటి మారుమూల ప్రాంతానికి కేటాయించడంలో ఆంతర్యమే మిటని సరుబుజ్జిలి మండల వాసులు ప్రశ్నిస్తున్నారు. సరుబుజ్జిలి మం డలంతో పాటు ఇతర మండలాలకు చెందిన సుమారు 300 మంది విద్యార్థులు ప్రతి రోజూ ఉన్నత చదువులకు ఆర్టీసీ బస్సుల్లో వేలాడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు ఇప్పటికైనా సరుబుజ్జిలిలో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

పరిశ్రమలో కార్మికుడు జారిపడి మృతి

రణస్థలం: పైడిభీమవరంలోని శ్రేయస్‌పరిశ్రమలో ప్రమాదవశాత్తు ఓ కార్మికుడు జారిపడి మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు..యూపీకి చెందిన షమీర్‌షేక్, రహిబుల్‌షేక్ మంగళవారం పనిచేస్తున్నారు.ఇంతలో పైఅంతస్తు నుంచి షమీర్‌షేక్ జారిపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం విజయనగరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ షమీర్‌షేక్ (22)మృతి చెందాడు. రహిబుల్‌షేక్ కూడా గాయాలయ్యాయి.ఆయన ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఘటనా స్థలాన్ని జేఆర్‌పురం ఎస్ఐ గోవిందరావు పరిశీలించి కేసు నమోదుచేశారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీకుమార్తెకు గాయాలు

బూర్జ: రోడ్డు ప్రమాదంలో తండ్రీకుమార్తెకు గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. మండలంలోని ఉప్పేట గ్రామానికి చెందిన బి.సూరిబాబు మంగళవారం తన ద్విచక్రవాహనంపై కుమార్తె త్రినేత్రిని కళాశాల బస్సు వద్దకు తీసుకువస్తున్నాడు.ఎదురుగావస్తున్న ఆర్టీసీ బస్సు గ్రామం దాటిన తర్వాత ఢీకొనడంతో సూరిబాబు, ఆయన కుమార్తెకు గాయాలయ్యాయి. 108లో పాలకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించి అనంతరం శ్రీకాకుళం మెరుగైన చికిత్స కోసం తరలించారు.ఈ మేరకు సూరిబాబు బూర్జ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

లారీని మినీవ్యాన్ ఢీకొని ఇద్దరికి..

నందిగాం:తురకలకోట సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం మినీవ్యాన్ లారీని ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. పలాసకు చెందినఅల్లు నానాజీ మినీ వ్యాన్‌లో టెక్కలి వైపు వెళ్తుండగా తురకలకోటకు వచ్చే సరికి బ్రేక్ ఫెయిల్ అయింది. దీంతో వ్యాన్ అదుపుతప్పి ముందుగా వెళ్తున్న లారీని ఢీకొంది. ఈ ఘటనలో నానాజీతో పాటు వ్యాన్‌లో ప్రయాణిస్తున్న మరొక వ్యక్తికి గాయాలయ్యాయి. క్యాబిన్‌లో ఇరుక్కున్న వీరిని హైవే అంబులెన్స్ సిబ్బంది బయటకు తీసి చికిత్స నిమిత్తం పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నానాజీ ఫిర్యాదు మేరకు ఎస్ఐ మహ్మద్ అమీర్ ఆలీ కేసు నమోదుచేశారు.

నౌపడ స్టేట్ బ్యాంక్ వద్ద..

సంతబొమ్మాళి:నౌపడ స్టేట్ బ్యాంక్ వద్ద మంగళవారం ఎదురెదురుగా వస్తున్న ప్రైవేటు బస్సు, కారు ఢీకొన్నాయి. ఈఘటనలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

కారు ఢీకొని ఒకరికి..

శ్రీకాకుళం క్రైమ్: శ్రీకాకుళంలోని అరసవల్లి మిల్లు జంక్షన్‌లో ద్విచక్రవాహనాన్ని కారుతో ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. శ్రీకాకుళంలోని నానుబాల వీధి సమీపంలో గల జానకీనగర్ కాలనీలో నివసిస్తున్న గోరుచుట్టి గిరి తనమిత్రుడు గుణశేఖర్‌తో కలిసి మంగళవారం ఉదయం పాతబస్టాండ్ నుంచి అరసవల్లి మిల్లు జంక్షన్‌లో ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. ఆ సమయంలో ఎదురుగా వస్తున్న కారు ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో గుణశేఖర్ దిచక్రవాహనంపై నుంచి వెనుకపడిపోయాడు. గిరికి మెడ నుంచి నడుమ భాగం వరకు గాయాలయ్యాయి. దీంతో స్థానికులు 108కుసమాచారం ఇచ్చి రిమ్స్‌కు తరలించారు. ఆవుట్‌పోస్టు పోలీసులు వివరాలు సేకరించి ట్రాఫిక్ పోలీసులకు సమాచారం ఇచ్చారు.ఈ మేరకు ఎస్ఐ మెట్ట సుధాకర్ కేసు నమోదు చేశారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

● రిమ్స్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు

అరసవల్లి: కార్మికుల సమస్యలను పరిష్కరించాలని రిమ్స్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు బి.మురళి, కోశాధికారి ఆర్.చిన్నా రావు, టౌన్ కన్వీనర్ ప్రకాశరావు కోరారు.ఈమేరకు మంగళవారం రిమ్స్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వ సర్వజనఆసుపత్రి ఆవరణలో రిమ్స్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్‌ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శానిటేషన్, సెక్యూరిటీ కార్మికుల వేతనాలు, ఈపీఎఫ్, ఈఎస్ఐలు సక్రమంగా చెల్లించడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో జి.కృష్ణవేణి, అల్లాడ సావిత్రి, కె.రవి,మామిడి సూర్యనారాయణ,ఎస్.లక్ష్మి, బి.సంతోషి, డోర.భారతి, ఎం.రమణ్మ, శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

భూగర్భ జలాలకు ప్రాధాన్యం ఇవ్వాలి

● పీఆర్ అండ్‌ఆర్‌డీ జాయింట్ కమిషనర్ శివప్రసాద్

కలెక్టరేట్: జిల్లాలో భూగర్భ జలాల పెంపు, నీటి పరిరక్షణ పనులు చేపట్టేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని, కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ సూచనల మేరకు ఫారం పాండ్స్, చెరువు గర్భం పైభాగంలో లభ్యతలో ఉన్న భూభాగంలో చేపల చెరువులు తవ్వాలని పీఆర్ అండ్‌ఆర్‌డీ జాయింట్ కమిషనర్ ఎం.శివప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం శ్రీకాకుళంలోని జిల్లా నీటి యాజమాన్య సంస్థ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో డ్వామాపీడీ జీవీ చిట్టిరాజు, జిల్లా నిఘా అధికారి, ఫైనాన్స్ మేనేజర్, ఏపీవో, ఈసీ టీఏ, డ్వామా సిబ్బంది పాల్గొన్నారు.

ఆయకట్టుకు నీరందించడంలో వైసీపీ విఫలం: కూన

బూర్జ: ఐదేళ్లల్లో వైసీపీ పాలనలో నారాయణపురం ఆయకట్టుకు నీరందించడంలో విఫలమయ్యారని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆరోపించారు. మంగళవారం నారాయణపురం ఆనకట్టను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం ఆనకట్టు శిథిలావస్థకు చేరిందని, వివరాలు సేకరించి సీఎం దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు.కార్యక్రమంలో ఇరిగేషన్ ఉన్నతాధికారులు, టీడీపీనాయకులు సనపలడిల్లీ, నూకరాజు, చంద్రశేఖర్, సూరపునాయుడు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణుల సమస్యలు పరిష్కరిస్తాం

పొందూరు : విశ్వబ్రాహ్మణుల సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. పొందూరు మండలానికి చెందిన విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు మంగళవారం రవికుమార్‌ను శ్రీకాకుళంలో ఆయనున్న కలిసారు. ఈ సందర్భంగా వారి సమస్యలను రవికుమార్ దృష్టికి తీసుకువెళ్లారు.

ప్రజల దాహార్తిని తీర్చడమే ధ్యేయం: ఎన్ఈఆర్

రణస్థలం: ప్రజల దాహార్తిని తీర్చడమే ధ్యేయమని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు తెలిపారు.మండలంలోని మెంటాడపంచాయతీ పరిధిలోని గొల్లపేట, అర్జునవలస పంచాయతీ పరిధిలోని గిరివానిపాలేంలో జల్‌జీవన్ మిషన్ నిధులతో ఇంటింటా ఏర్పాటుచేసిన కొళాయిలను మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు డీజీఏ ఆనందరావు, జగన్నాథ ంనాయుడు, లంక ప్రభ, పైడయ్యరెడ్డి, గొర్లె లక్ష్మణరావు, రౌతు శ్రీనివాసరావు, రామకృష్ణ, గొర్లె సాయి పాల్గొన్నారు.

కౌలురైతుల గుర్తింపునకు సదస్సులు

ఎచ్చెర్ల:ఎచ్చెర్ల, జరజాంల్లో కౌలు రైతులు గుర్తింపు, నమోదుకు మంగళవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం డివిజన్ ఏడీఏ బగ్గురజని మాట్లాడుతూ కౌలుకు వ్యవసాయం చేస్తున్న రైతులు తప్పనిసరిగా కౌలు రైతులుగా నమోదు చేసుకుని గుర్తింపు కార్డులు పొందాలన్నారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీఏవెంకటరావు వరి యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు.జరజాంలో రాయితీపై సుడోమోనస్ రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏవో వైసురేష్ పాల్గొన్నారు.

●**ఆమదాలవలస:** కౌలు రైతులు వీఆర్వో నుంచి క్రాప్ కల్టివేటెడ్ రైట్ కార్డులు(సీసీఆర్‌సీ) తీసుకోవాలని ఏవో మెట్టమోహన్‌రావు రైతులకు సూచించారు. మండలంలోని తోటాడ రైతు సేవా కేంద్రంలో సీసీఆర్‌సీ కార్డులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పంటపొలాల్లో భూసార పరీక్ష కేంద్రం సిబ్బంది నిర్వహించిన ఫలితాల ధ్రువీకరణ పత్రాలు రైతులకు అందించారు. కార్యక్రమంలో టీడీపీనాయకులు తాండ్ర హరిబాబు, బెండి రామ్మోహన్, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ కూన సుధీర్ పాల్గొన్నారు.

●**కంచిలి:**కౌలురైతులకు గుర్తింపు కార్డులు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఏవో ధనుంజయ తెలిపారు. గొల్లకంచిలిలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎన్‌వీకేఎస్ రవి పాల్గొన్నారు.

● **గార:**రామచంద్రాపురం, గొంటి పంచాయతీల్లో కౌలు రైతులకు జిల్లా వ్యవసాయ శాఖ జేడీ కె.శ్రీధర్, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ కృష్ణారావు, భవానీశంకర్, ఏవో దుంపల పద్మావతి అవగాహన సదస్సు నిర్వహించారు.

ప్రమాద బీమా పాలసీ సద్వినియోగం చేసుకోవాలి

శ్రీకాకుళం క్రైమ్: స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా పోలీసు శాలరీ ప్యాకేజీ (పీఎస్‌పీ) కింద అందజేస్తున్న ప్రమాద బీమా పాలసీ పోలీసులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ జీఆర్ రాధిక పిలుపునిచ్చారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కానిస్టేబుల్ బొడ్డేపల్లి గన్నయ్యకు నామినిగా ఉన్న బి.వరహాలమ్మకు పీఎస్‌పీ కింద 75 వేల రూపాయలు చెక్కును జిల్లా పోలీసు కార్యాలయంలో అందించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ బి. ప్రేమ్ కాజల్, ఎస్‌బీఐ యూనియన్ రీజినల్ సెక్రటరీ వెంకటరమణ పాల్గొన్నారు.

మొబైల్ యాప్‌లో విద్యుత్ బిల్లుల చెల్లింపు

కంచిలి: ఏపీఈపీడీసీఎల్ మొబైల్ యాప్, వెబ్‌సైట్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని ఎలక్ట్రికల్ ఏఈ గురయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్బీఐ మార్గదర్శకాలు అనుసరించి ఇకమీదట ఫోన్‌పే, గూగు ల్‌పే, పేటీఎం, ఇతర యూపీఐ యాప్‌ల్లో బిల్లులు చెల్లించేటప్పుడు ఏపీఈపీడీసీఎల్ పేరు కనిపించదని పేర్కొన్నారు. వినియోగదారులు సంస్థ మొబైల్ యాప్ ఈస్టరన్ పవర్‌ని గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొనిగాని లేదా సంస్థ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఏపీఈస్టర్‌పవర్.కామ్ నుంచి గాని బిల్లులు చెల్లించవచ్చని తెలిపారు. వీటితో పాటు ఇతర యూపీఐ యాప్స్, డెబిట్, క్రెడిట్, నెట్ బ్యాకింగ్, వాల్లెట్స్, కాష్‌కార్డ్స్ కూడా వాడుకోవచ్చని పేర్కొన్నారు.

నీట్ రద్దు చేయాలి

గుజరాతీపేట: నీట్ పరీక్షను వెంటనే రద్దు చేయాలని బీసీ సంక్షేమ సంఘం యువజనవిభాగం అధ్యక్షుడు రాజమహంతి భానుచందర్ కోరారు. మంగళవారం శ్రీకాకుళంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ లీకేజీకి పాల్పడిన వ్యవహారంపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. దేశంలో లక్షలాది మంది విద్యార్థుల జీవితాలకు సంబంధించిన పరీక్షకావడంతో ఎంతో జాగ్రత్తతో నిర్వహించాల్సిన పరీక్ష విషయంలో అశ్రద్ధ వహించడం దురదృష్టకరమని తెలిపారు. ఎన్‌టీఏ నిర్వాకం వల్ల విద్యార్థులు రోడ్డున పడ్డారని పేర్కొన్నారు.

కోర్కెల దినాన్ని విజయవంతం చేయాలి

అరసవల్లి: అఖిల భారత కోర్కెల దినం పురస్కరించుకుని నిర్వహిస్తున్న నిరసన ప్రదర్శనలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళవారం శ్రీకాకుళంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ గత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు వ్యతిరేకంగా, కార్పొరేట్లకు అనుకూలంగా పనిచేశాయని, ప్రజలు వీరికి బుద్ధిచెప్పారని కోరారు. నాలుగు లేబర్ కోడ్లు అమల్లోకి వస్తే సమ్మెచేయడం సాధ్యంకాదని తెలిపారు.సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.సూరయ్య, ఎన్.గణపతి, ఎస్.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

ఇచ్ఛాపురం:స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ బోర పుష్ప ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సభ్యులు,అధికారులు హాజరుకావాలని కోరారు.

రేపు ఘంటసాల మహోత్సవాలు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళంలోని అంబేడ్కర్ ఆడిటోరియంలో ప్రముఖగాయకుడు టి.శరత్‌చంద్ర ఆధ్వర్యంలోఘంటసాల గీతామృతమహోత్సవాలు గురువారం నిర్వహిస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఘంటసాల అభిమానులు,హైందవధర్మ దీక్షాపరులు, సంగీత ప్రియులు హాజరుకావాలని కోరారు.

13, 14 తేదీల్లో బ్యాడ్మింటన్ పోటీలు

శ్రీకాకుళం స్పోర్ట్స్: జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ఇండోర్ స్టేడియంలో ఈనెల 13, 14వ తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్‌అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కిల్లంశెట్టి సాగర్ తెలిపారు. మంగళవారం శ్రీకాకుళంలోని శాంతినగర్ కాలనీలోని ఇండోర్ స్టేడియంలో విలేకరులతో మాట్లాడుతూ అండర్-11, 13, 15, 17,19, పురుషులు, మహిళా విభాగాలతోపాటు వెటరన్ క్రీడాకారులకు జిల్లాస్థాయి పోటీలతోపాటు రాష్ట్రస్థాయి ఎంపికలు జరుగుతాయని, ఇందులో ఎంపికైన వారు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఏపీబీవీ షెడ్యూల్ ప్రకారం శ్రీకాకుళంలో అండర్-19 రాష్ట్రస్థాయి పోటీలు కూడా నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో ఆ సంఘం కార్యదర్శి మెట్ట అశోక్‌కుమార్, కోశాధికారి గోర అనీల్‌కుమార్, జాయింట్ సెక్రటరీలు గురుగుబెల్లి ప్రసాద్, రౌతు సంతోష్‌కుమార్, సభ్యులు ఎం.సంతోష్‌కుమార్, సీఈవో సంపతిరావు సూరిబాబు పాల్గొన్నారు.

అరసవల్లిలో ఆదిత్యుని కల్యాణం

అరసవల్లి: అరసవల్లిలోని ఆదిత్యుని కల్యాణం మంగళవారం వైభవంగా జరిగింది. జ్యేష్ఠ బహుళ ఏకాదశి పురస్కరించుకుని అనివెట్టి మండపంలో ప్రధానఅర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ కళ్యాణం నిర్వహించామని ఈవో ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు సాందీపశర్మ, దర్భముళ్ల శ్రీనివాసశర్మ పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు అభినందన

ఇచ్ఛాపురం: కేసుపురం పంచాయతీ పరిధిలో గల కేశుపురం, సన్యాసిపుట్టుగ, నీలాపుట్టుగ గ్రామాలకు చెందిన పదోతరగతి విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించడంతో అభినందించారు. ఈ మేరకు మంగళవారం సన్యాసిపుట్టుగలో జరిగిన కార్యక్రమంలో కాళీమాత సేవా సమితి ఆధ్వర్యంలో కాళీమాత సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు నూరు గంగరాజు అండ్ బ్రదర్స్ ఒక్కో విద్యార్థికి రూ1000 నగదు బహుమతితో పాటు మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దక్కత ఢిల్లీరావు, పురుషోత్తం, కామేశ్వరావు, నరేంద్ర, భీమారాజు, చిరంజీవి, కామరాజు, లోకనాథం, కూర్మారావు, హేమసుందర్ పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు విద్యార్థి ఎంపిక

పొందూరు: పొందూరు భవితకేంద్రం విద్యార్థి నక్కిట నాగహర్షవర్ధన్ ఇటీవల అనంతపురంలో జరిగిన రాష్ట్రస్థాయి ట్రెకింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచింది. ఈ మేరకు జాతీయస్థాయి పోటీలకు ఎంపికకావడంతో మంగళవారం ఐఈఆర్‌టీ జిల్లా కోఆర్డినేటర్ బుడుమూరు గోవిందరావు భవితకేంద్రంలో సన్మానించారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టీ మండల కో-ఆర్డినేటర్‌లు దినేష్, రాధారాణి పాల్గొన్నారు.

సూపరింటెండెంట్‌గా సాయిరాం

అరసవల్లి: రిమ్స్ మెడికల్ కాలేజీ ఆఫీసు సూపరింటెండెంట్‌గా ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో బి.మీనాక్షి, కార్యాలయ సిబ్బంది సాయిరాంను సత్కరించారు.

ధ్రువపత్రాలకోసం విద్యార్థుల అగచాట్లు

ఇచ్ఛాపురం:జిల్లాలో ధ్రువపత్రాలకోసం విద్యార్థులు అవస్థలకు గురవుతున్నారు. 732 గ్రామ, వార్డు సచివాలయాల్లో సర్వర్ డౌన్ కావడంతో సకాలంలో అందడంలేదు. ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలు ప్రారంభంకావడంతోకుల,ఆదాయ తదితర ధ్రువపత్రాలు సమర్పించాల్సిఉంది. సార్వత్రిక ఎన్నికల అనంతరం కొత్తప్రభుత్వం కొలువుదీరడంతో వైసీపీ ప్రభుత్వం లోగోలు,అప్పటి సీఎం జగన్‌ఫోటోలుఉన్న పోర్టల్‌లో మార్పులు చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ఈప్రక్రియలో భాగంగా ఈనెల ఆరో తేదీ నుంచి ధ్రువపత్రాలు జారీప్రక్రియ ప్రారంభించారు. అప్పటికే సచివాలయాల్లో కుల, ఆదాయ,ఓబీసీ ధ్రువపత్రాలకోసం దరఖాస్తులు పేరుకుపోయాయి.ఈనేపథ్యంలో సచివాలయాల్లో ధ్రువపత్రాల జారీప్రక్రియ ప్రారంభమైనా నిత్యం సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి.మరో వైపుపాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు కుల,ఆదాయ ధ్రువపత్రాలు సమర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులపై ఒత్తిడి తీసుకొస్తున్నాయి. దీంతో గ్రామ వార్డు సచివాలయాల చుట్టూ నిత్యం తిరుగుతున్నా సర్వర్లు పనిచేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వారు వాపోతున్నారు. కాగా రోజుకు పదుల సంఖ్యలో విద్యార్థులు ధ్రువపత్రాల కోసం దరఖాస్తులు చేస్తున్నారని వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ బి.విజయ్‌కుమార్ తెలిపారు. నిత్యం సర్వర్లు పనిచేయకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని చెప్పారు. సర్వర్‌డౌన్ కావడంతో రోజుకు ఒకటిరెండు మాత్రమే చేస్తున్నామని, ఉదయం 10గంటలకు వచ్చి రాత్రి వరకు సచివాలయాల్లోఉండి దరఖాస్తులు కొడుతున్నామని తెలిపారు.అయితే సాయంత్రం తరువాత సర్వర్ కాస్త పనిచేయడంతో కొన్ని దరఖాస్తులు అవుతున్నాయని, విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా సర్టిఫికెట్లు చేస్తామని చెప్పారు.

యక్కలలో సింధు పోలమ్మ సంబరం

కంచిలి: మండలంలోని యక్కల గ్రామంలో సింధుపోలమ్మ అమ్మవారి సంబరాన్ని గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం మహిళలు ఘటాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి మొక్కులు చెల్లించారు.

స్టూడెంట్ కిట్లు పంపిణీ

కంచిలి: కంచిలి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు టీడీపీ మండలాధ్యక్షుడు బంగారు కురయ్య స్టూడెంట్ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జగదీష్‌పట్నాయక్, శోభన్, మురళీపట్నాయక్, సర్పంచ్ లండ లక్ష్మి, యమున, హెచ్ఎం ఎస్.లీలావని, పైల పురుషోత్తం రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం

సోంపేట: కొర్లాం జడ్పీ ఉన్నతపాఠశాలలో పదోతరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు తన్విఫౌండేషన్ ఆధ్వర్యంలో బహుమతులు ప్రదానంచేశారు. కార్యక్రమంలో సురేష్, గణపతి పాల్గొన్నారు.

ప్రైవేటు వ్యక్తి అద్దె వసూలుపై ఫిర్యాదు

సోంపేట: సోంపేట పంచాయతీలో ఓవ్యక్తి అద్దెపేరుతో షాపు యజమానులనుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఈవోకి మాజీ ఎంపీపీ చిత్రాడ శ్రీనివాసరావు తదితరులు ఫిర్యాదుచేశారు. ఈవ్యక్తిపై చర్య తీసుకోవాలని కోరారు.

ఆసుపత్రిలో పింఛన్ పంపిణీ

పొందూరు:కింతలికి చెందిన దుంపల రతనాలమ్మ బ్రెయిన్ స్ట్రోక్‌తో శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతుండగా సచివాలయ సిబ్బంది పింఛన్ అందజేశారు. సర్పంచ్ పైడి రామప్రసాద్, ఎంపీటీసీ కె.హనుమంతురావు సూచనలతో సచివాలయ సిబ్బంది ఆసుపత్రిలో అత్యవసర చికిత్స పొందుతున్న రతనాలమ్మ పింఛన్‌ను కుటుంబసభ్యులకు అందించారు.

అతిసారంపై అప్రమత్తంగా ఉండాలి

సరుబుజ్జిలి:అతిసారంపై అప్రమత్తంగా ఉండాలని సీహెచ్‌వో మోహన్ రావు తెలిపారు. మంగళవారం మండలంలోని రొట్టవలస విలేజ్ హెల్త్‌క్లీనిక్‌లో అతిసార వారోత్సవాలు పురస్కరించుకుని పిల్లల తల్లిదం డ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగు యువత మండలాధ్యక్షుడు తాడేల రాజారావు, తేజేశ్వరి, హెల్త్ అసిస్టెంట్ కృష్ణారావు, టీడీపీ నేతలు రాంబాబు, బెవర రాజారావు, రాయి రమణ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మ పేరిట ప్రతి ఒక్కరూ మొక్క నాటాలి

ఆమదాలవలస:ప్రధాని మోదీ పిలుపు మేరకు కన్నతల్లి గుర్తుగా మొక్క నాటాలని ఆమదాలవలస నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ పేడాడ సూరపునాయుడు పిలుపునిచ్చారు. మంగళవారం కొర్లకోటలో జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యాం ప్రసాద్‌ముఖర్జీ జయంతి పురస్కరించుకుని మొక్కలు నాటారు.

●**గుజరాతీపేట:** పర్యావరణ పరిరక్షణ కోసం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రారంభించిన అమ్మ పేరిట ప్రతి ఒక్కరూ మొక్క నాటాలని ఓబీసీ మోర్చా రాష్ట్ర కన్వీనర్ పి.సురేష్‌సింగ్ కోరారు.ఈ మేరకు శ్రీకాకుళం నగర పాలకసంస్థ 28వవార్డులో మొక్కలునాటారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రాధారాణి, బీవీఆర్‌మూర్తి, నగేష్ పాల్గొన్నారు.

బడిబయట పిల్లలను బడిలో చేర్పించాలి

ఇచ్ఛాపురం: బడి బయట పిల్లలను బడుల్లో చేర్పించాలని డొంకూరు ఉన్నత పాఠశాల హెచ్ఎం జె.సరోజిని కోరారు. మంగళవారం డొంకూరులో విద్యా ప్రవేశిక కార్యక్రమాన్ని పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులుగ్రామంలో ర్యాలీనిర్వహించి బడిబయట ఉండేవారిని బడుల్లో చేర్పించాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు పాల్గొన్నారు.